

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 17-09-2026 | సంపుటి - 31 | సంచిక - 115 | రూ : 4 | పేజీలు : 8


# కేసీఆర్ భూదోపిడీపై విచారణ

## రూ. లక్ష కోట్ల విలువైన భూమిని దోచారు



- ఆయన కుటుంబ ఆధీనంలో 440 ఎకరాలు
- విదేశీ ముఠాకు ధరణి పోర్టల్ ఇచ్చారు
- నిగ్గు తేల్చేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- 30 రోజుల్లో అధికారులు నివేదిక ఇవ్వాలి
- సత్యం రామలింగరాజు భూమి కేటీఆర్‌కు ఎలా బదిలీ అయ్యింది?
- రంగనాయక సాగర్‌లో హరీశ్‌రావు ఫామ్‌హౌస్ అక్రమమే
- మైహోం కంపెనీకి 2,300 ఎకరాలు ఎలా ఇచ్చారు?
- 22-Aలో 98,37,320 ఎకరాలు ఉండాల్సిందే
- లేకుంటే వాటికి రక్షణ ఉండదు : శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో



# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

- సీఎం కుటుంబానికి 308 ఎకరాల భూమి
- కాంగ్రెస్ అక్రమాలు బయటపెడతామనే మాపై సస్పెన్షన్
- భూభారతి, 22ఏపై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్ : అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కుటుంబానికి 308 ఎకరాలు భూమి ఉందన్నారు. వెల్దండ మండలం కొట్ర గ్రామంలోనే 175 ఎకరాలు, వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో 79 ఎకరాలు, ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఇతర భూమి 54 ఎకరాల చొప్పున ఉందని వివరించారు. రేవంత్‌రెడ్డి కుటుంబ భూముల వివరాలు అన్ని త్వరలో మరిన్ని బయటకి వస్తాయని చెప్పారు. ప్రజల సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే, డైవర్షన్ రాజకీయాలకు సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని

తరువాయి 2లో

## భారత నౌకపై పాక్ నౌక దాడి..

# దౌత్యవేత్తకు సమన్లు జారీ



- అంతర్జాతీయ జలాల్లో సెప్టెంబరు 15న ఘటన
- ఘటనలో పెద్దగా నష్టం జరగలేదన్న భారత వర్గాలు
- పాక్ రాయబారికి భారత్ సమన్లు
- పాక్ నౌక వ్యవహారం పై తీవ్ర నిరసన
- 1991 ఒప్పందం ఉల్లంఘించిందన్న భారత్

అరేబియా సముద్రంలో భారత నౌకాదళానికి చెందిన ఓ నౌకను పాకిస్థాన్ నేవీకి చెందిన నౌక ఢీకొన్న ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. పాకిస్థాన్ హైకమిషన్ చార్జ్ డి అఫైర్స్ సాద్ అహ్మద్ వారైచ్‌ను బుధవారం విదేశాంగ శాఖ పిలిపించి నిరసన తెలిపింది. పాకిస్థాన్ నౌకాదళ యూనిట్ వ్యవహరించిన తీరు "ఆమోదయోగ్యం కానిది, వృత్తిపరమైన తరువాయి 2లో

## కూలిన హెలికాప్టర్..

# ముగ్గురు దుర్మరణం



- అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో ఘటన
- మృతుల్లో ఒకరు పాదచారి.. మరొకరికి గాయాలు
- న్యూస్ ఛానల్‌కు చెందిన హెలికాప్టర్‌గా గుర్తింపు
- ప్రమాద కారణాలపై విచారణకు ఆదేశం

అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో మంగళవారం రాత్రి ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. చాట్స్‌వర్త్ ప్రాంతంలోని ఓ పార్కింగ్ లాట్‌లో హెలికాప్టర్ కుప్పకూలడంతో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతడిని ఆసుపత్రికి తరలించారు. ఈ వివరాలను లాస్ ఏంజిల్స్ ఫైర్ డిపార్ట్‌మెంట్ (ఎల్ఏఎఫ్‌డీ) ధ్రువీకరించింది.

తరువాయి 2లో

UNIFIED PAYMENTS INTERFACE

## యూపీఐపై కొత్త రుసుము..
## తిరిగి నగదు వైపు అడుగులేనా?

- కొన్ని యూపీఐ లావాదేవీలపై కొత్తగా మర్చంట్ డిస్కౌంట్ రేట్
- రూ. 2000 దాటిన వ్యాపార చెల్లింపులపై రుసుము విధింపు
- తిరిగి నగదు లావాదేవీలు పెరగొచ్చని రిటైలర్ల సంఘం ఆందోళన
- వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు లేవని స్పష్టం చేసిన కేంద్రం

యూపీఐ ద్వారా జరిగే కొన్ని వ్యాపార లావాదేవీలపై కొత్తగా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించడం తరువాయి 2లో




## నంబర్ 1 పాస్‌పోర్ట్ ఇదే
# భారత ర్యాంక్ ఎంతంటే?

- ప్రపంచ పాస్‌పోర్ట్ పవర్ ర్యాంకింగ్స్‌లో 7 స్థానాలు పడిపోయిన భారత్
- గతేడాది 66వ స్థానం నుంచి ఈసారి 73వ ర్యాంకుకు పతనం
- యూఏఈ పాస్‌పోర్ట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా గుర్తింపు
- ఈ ర్యాంకింగ్‌లను అంగీకరించబోమన్న భారత ప్రభుత్వం
- జాబితాలో అట్టడుగున 99వ స్థానంలో నిలిచిన ఆఫ్ఘనిస్థాన్

## హైదరాబాద్‌లో భూగర్భ జలాల డేంజర్ బెల్స్

- గ్రేటర్ హైదరాబాద్‌లో ఆందోళనకరంగా పడిపోతున్న భూగర్భ జలాలు
- గతేడాదితో పోలిస్తే సగటున 5 మీటర్ల మేర తగ్గిన నీటిమట్టం
- 22 శాతం వర్షపాతం లోటు, పెరిగిన వినియోగమే ప్రధాన కారణం
- కుత్బుల్లాపూర్‌లో ఏకంగా 39 మీటర్లకు పడిపోయిన నీటిమట్టాలు
- ఈ నెల వర్షా లు లేకుంటే తీవ్ర నీటి కష్టాలు తప్పవని హెచ్చరిక

2లో



## భారత్, కివీస్ కీలక ఒప్పందం
# 95% ఎగుమతులపై పన్ను రాయితీలు



- న్యూజిలాండ్ పార్లమెంట్‌లో ఎఫ్‌టీఏ బిల్లుకు ఆమోదం
- 57 శాతం ఎగుమతులకు వెంటనే సుంకం మినహాయింపు
- పూర్తిస్థాయిలో 95 శాతం ఎగుమతులకు సుంకాల తగ్గింపు
- కివీ పరిశ్రమకు 125 మిలియన్ న్యూజిలాండ్ డాలర్ల వరకు ఆదా
- ఈ ఏడాది చివర్లో అమల్లోకి ఎఫ్‌టీఏ

2లో

# భారత నౌకపై పాక్ నౌక దాడి.. దౌత్యవేత్తకు సమన్లు జారీ

అరేబియా సముద్రంలో భారత నౌకాదళానికి చెందిన ఓ నౌకను పాకిస్థాన్ నేవీకి చెందిన నౌక ఢీకొన్న ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. పాకిస్థాన్ హైకమిషన్ చార్జ్ డి అఫైర్స్ సాద్ అహ్మద్ వారైచ్‌ను బుధవారం విదేశాంగ శాఖ పిలిపించి నిరసన తెలిపింది. పాకిస్థాన్ నౌకాదళ యూనిట్ వ్యవహరించిన తీరు "ఆమోదయోగ్యం కానిది, వృత్తిపరమైన ప్రమాణాలకు విరుద్ధం" అని భారత్ పేర్కొంది. ఈ ఘటన నిన్న (సెప్టెంబరు 15) సాయంత్రం ఉత్తర అరేబియా సముద్రంలో అంతర్జాతీయ జలాల్లో జరిగినట్లు సమాచారం. సాధారణ నిఘా విధుల్లో ఉన్న భారత నౌకకు పాకిస్థాన్ నౌక వేగంగా సమీపానికి వచ్చి, సురక్షితం కాని రీతిలో దిశ మార్చుకుంటూ వచ్చి ఢీకొన్నట్లు భారత వర్గాలు తెలిపాయి. ఘటనలో పెద్దగా నష్టం జరగలేదని పేర్కొన్నాయి. పాకిస్థాన్ నౌక వ్యవహరించిన తీరు 1991లో భారత్, పాకిస్థాన్ మధ్య కుదిరిన సైనిక విన్యాసాలు, కదలికలకు ముందస్తు సమాచారం ఇచ్చే ఒప్పందంలోని ఆర్టికల్ 10కు విరుద్ధంగా ఉందని విదేశాంగ శాఖ తెలిపింది. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా పాకిస్థాన్ సైనిక యూనిట్లు సముద్రంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ఇరు దేశాల మధ్య ఉన్న ఒప్పందాలను గౌరవించాలని ఆ దేశ రాయబారికి భారత్ సూచించింది. ఈ సందేశాన్ని పాకిస్థాన్ విదేశాంగ శాఖకు చేరవేయాలని ఆదేశించింది. ఇదే సమయంలో ఇస్లామాబాద్‌లోని భారత చార్జ్ డి అఫైర్స్ కూడా పాకిస్థాన్ విదేశాంగ శాఖకు అధికారికంగా నిరసన తెలియజేయాలని కేంద్రం సూచించింది.

## కూలిన హెలికాప్టర్..
# ముగ్గురు దుర్మరణం

అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో మంగళవారం రాత్రి ఘోర హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. చాట్స్‌వర్త్ ప్రాంతంలోని ఓ పార్కింగ్ లాట్‌లో హెలికాప్టర్ కుప్పకూలడంతో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతడిని ఆసుపత్రికి తరలించారు. ఈ వివరాలను లాస్ ఏంజిల్స్ ఫైర్ డిపార్ట్‌మెంట్ (ఎల్ఏఎఫ్‌డీ) ధ్రువీకరించింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 7 గంటల సమయంలో మేసన్ అవెన్యూలోని వాణిజ్య భవనాల మధ్య ఉన్న పార్కింగ్ స్థలంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. హెలికాప్టర్ నేలను ఢీకొట్టగానే పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో అక్కడ పార్క్ చేసి ఉన్న నాలుగు వాహనాలు, రెండు కార్గో కంటైనర్లు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న 50 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. మృతుల్లో ఒకరు ప్రమాద సమయంలో పార్కింగ్ లాట్‌లో నడుచుకుంటూ వెళ్తున్న పాదచారి అని ఎల్ఏఎఫ్‌డీ కెప్టెన్ బ్రాండెన్ సిల్వర్‌మాన్ తెలిపారు. మిగిలిన ఇద్దరు హెలికాప్టర్‌లోని సిబ్బంది అయి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఎంతమంది ఉన్నారనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. స్థానిక మీడియా కథనాల ప్రకారం, ఈ హెలికాప్టర్ ప్రముఖ న్యూస్ ఛానల్ ఎన్‌బీసీ4కు చెందిన యూరోకాప్టర్ AS350 B2 మోడల్‌గా గుర్తించారు. సమీపంలో ఒక మెట్రో బస్సు, కారు ఢీకొన్న మరో ప్రమాదాన్ని కవర్ చేయడానికి వెళ్తుండగా ఈ విషాదం జరిగింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఇప్పటికే సమీపంలో ఉండటంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టగలిగారు. ప్రమాదానికి గల కారణాలపై జాతీయ రవాణా భద్రతా బోర్డు, ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ విచారణ చేపట్టనున్నాయి. ఈ ఘటనపై లాస్ ఏంజిల్స్ మేయర్ కరెన్ బాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆమె ప్రగాఢ సంతాపం తెలిపారు.

## యూపీఐపై కొత్త రుసుము..
# తిరిగి నగదు వైపు అడుగులేనా?

యూపీఐ ద్వారా జరిగే కొన్ని వ్యాపార లావాదేవీలపై కొత్తగా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించడం పట్ల రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం దేశాన్ని మళ్లీ నగదు ఆధారిత ఆర్థిక వ్యవస్థ వైపు మళ్లించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 2026 అక్టోబర్ 15వ తేదీ నుంచి అమల్లోకి రానున్న ఈ నూతన నిబంధనల ప్రకారం, రూ. 2,000 దాటిన వ్యాపార చెల్లింపులపై ఈ రుసుము వర్తిస్తుంది. కొత్త నిబంధనల మేరకు, వినియోగదారుల నుంచి వ్యాపారులకు జరిగే రూ. 2,000 పైబడిన చెల్లింపులపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తారు. రైల్వే, టెలికాం, ఇన్సూరెన్స్, ఇంధనం వంటి రంగాలకు ఫ్లాట్‌గా రూ. 5 రుసుము ఉంటుంది. అయితే, యూపీఐ క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ. 1 లక్ష లోపు లావాదేవీలు నిర్వహించే చిన్న వ్యాపారులకు ఈ ఛార్జీల నుంచి మినహాయింపు కల్పించారు. ఈ మార్పు కేవలం 4 శాతం లావాదేవీలపై మాత్రమే ప్రభావం చూపుతుందని, మిగిలిన 96 శాతం వ్యాపార లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ నిర్ణయంపై రిటైలర్ల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. "తక్కువ లాభాలతో పనిచేసే చిన్న వ్యాపారులు ఇకపై యూపీఐ కంటే నగదు లావాదేవీలకే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది" అని ఆర్ఏఐ సీఈఓ కుమార్ రాజగోపాలన్ పేర్కొన్నారు. దీపావళి పండుగ సీజన్‌కు ముందు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని, ఇది వ్యాపారాలపై మరింత భారం మోపుతుందని క్లాతింగ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సంతోష్ కటారియా తెలిపారు. గతంలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించిన వ్యాపారులే, ఇప్పుడు తిరిగి నగదును ప్రోత్సహించే పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఛార్జీలు ప్రభుత్వ పన్ను కాదని, యూపీఐ వ్యవస్థను నిర్వహించే బ్యాంకులకు, పేమెంట్ యాప్ సంస్థలకు వెళ్లే రుసుము అని ప్రభుత్వ వర్గాలు వివరించాయి. ఈ నిర్ణయాన్ని ఐదేళ్ల క్రితమే ప్రతిపాదించామని, దీనిని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. వినియోగదారులపై ఎలాంటి భారం పడదని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. వెరసి, ఈ మార్పుల ప్రభావం వ్యాపారులపైనే ఉంటుంది తప్ప, సాధారణ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

# అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అబద్ధాలు

హైదరాబాద్ : అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కుటుంబానికి 308 ఎకరాలు భూమి ఉందన్నారు. వెల్దండ మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలోనే 175 ఎకరాలు, వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో 79 ఎకరాలు, ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఇతర భూమి 54 ఎకరాల చొప్పున ఉందని వివరించారు. రేవంత్‌రెడ్డి కుటుంబ భూముల వివరాలు అన్ని త్వరలో మరిన్ని బయటకి వస్తాయని చెప్పారు. ప్రజల సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే, డైవర్షన్ రాజకీయాలకు సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని చెప్పారు. ప్రభుత్వ అక్రమాలను బయటపెడతామనే సభలో లేకుండా చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడినవన్నీ అర్ధసత్యాలు, అబద్ధాలని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటుకు టీ షర్ట్, స్టిక్కర్లు వేసుకుని వెళ్తే ఒప్పు, తాము టీ షర్టు వేసుకుని అసెంబ్లీకి వస్తే తప్పా? అని ప్రశ్నించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియమాలు వేరా? అని అడిగారు.

### పథకం ప్రకారమే గెంటేశారు

వృద్ధులకు రూ.నాలుగు వేల పెన్షన్, మహిళలకు రూ.2500 ఇవ్వలేదనీ, విద్యార్థులకు భరోసా కార్డు ఇవ్వలేదని హరీశ్‌రావు విమర్శించారు.ఈ వైఫల్యాలను టీ షర్ట్ మీద రాసుకొస్తే తమను సస్పెండ్ చేశారని అన్నారు. తాము కావాలని అసెంబ్లీ నుంచి బయటకు రాలేదనీ, పక్కా పథకం ప్రకారమే గెంటేశారని విమర్శించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికి, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగితే.. కనీసం మైక్ ఇవ్వాలని అడిగినందుకు సస్పెండ్ చేశారని అన్నారు. తాము సభలో ఉంటే కాంగ్రెస్ కుంభకోణాలు, రేవంత్‌రెడ్డి కుటుంబ అవినీతి బయటపడుతుందనే భయంతోనే మొత్తం సెషన్‌కి తమను సస్పెండ్ చేశారని వివరించారు. సస్పెన్షన్ ఎత్తేస్తే ఆధారాలతో సభకు వస్తామని తమ ఎమ్మెల్యేలు సవాల్ చేశారని గుర్తు చేశారు. సీపీఐ, బీజేపీలు అడిగినా సస్పెన్షన్ ఎత్తేసే దమ్ము సీఎంకు లేదన్నారు.

# నంబర్ 1 పాస్‌పోర్ట్ ఇదే.. భారత ర్యాంక్ ఎంతంటే?

ప్రపంచ దేశాల పాస్‌పోర్ట్‌ల శక్తిని అంచనా వేసే 'పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026'లో భారత్ స్థానం పడిపోయింది. ఈ తాజా గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో భారత పాస్‌పోర్ట్ 73వ స్థానంలో నిలిచింది. 2025లో 66వ స్థానంలో ఉన్న భారత్, ఈ ఏడాది ఏకంగా 7 స్థానాలు దిగజారడం గమనార్హం. ఇదే సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పాస్‌పోర్ట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా జాబితాలో చిట్టచివరన నిలిచింది. 'ఆర్టన్ క్యాపిటల్' సంస్థ ఈ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌ను రూపొందిస్తుంది. వీసా లేకుండా (వీసాఫ్రీ), వీసా ఆన్ అరైవల్ సౌకర్యాలున్న దేశాల సంఖ్య ఆధారంగా 'మొబిలిటీ స్కోర్' (ఎంఎస్) కేటాయిస్తారు. ఈ స్కోర్ ఎంత ఎక్కువగా ఉంటే ఆ పాస్‌పోర్ట్ అంత శక్తిమంతమైనదని అర్థం. మొత్తం 199 దేశాల పాస్‌పోర్ట్‌లను ఈ ర్యాంకింగ్ కోసం విశ్లేషించారు.

### భారత్ పరిస్థితి ఏమిటి?

ప్రస్తుతం భారత్ మొబిలిటీ స్కోర్ 69గా ఉంది. ఈ స్కోర్‌తో భారత్.. జింబాబ్వే, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, సావో టోమ్ అండ్ ప్రిన్సిపీ, వియత్నాం వంటి దేశాలతో కలిసి 73వ స్థానాన్ని పంచుకుంటోంది. భారత పాస్‌పోర్ట్ ఉన్నవారు 25 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. మరో 39 దేశాల్లో వీసాఆన్‌అరైవల్ సౌకర్యం ఉంది. అయితే, 129 దేశాలకు వెళ్లాలంటే ముందస్తుగా వీసా తప్పనిసరి. గతేడాదితో పోలిస్తే వీసా ఆన్ అరైవల్ దేశాల సంఖ్య తగ్గడంతో మొబిలిటీ స్కోర్ 73 నుంచి 69కి పడిపోయింది. ఇదే ర్యాంకు పతనానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

### టాప్, బాటమ్ దేశాలు

ఈ జాబితాలో యూఏఈ పాస్‌పోర్ట్ 181 మొబిలిటీ స్కోర్‌తో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానంలో నిలిచింది. యూఏఈ పౌరులు 138 దేశాలకు వీసా లేకుండా, 43 దేశాలకు వీసాఆన్‌అరైవల్‌తో ప్రయాణించవచ్చు. కేవలం 17 దేశాలకు మాత్రమే వారికి వీసా అవసరం. ఇక, ఈ జాబితాలో ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా 99వ ర్యాంకులో ఉంది. దాని మొబిలిటీ స్కోర్ కేవలం 35 మాత్రమే. ఆఫ్ఘన్ పౌరులు 163 దేశాలకు వెళ్లాలంటే కచ్చితంగా వీసా తీసుకోవాల్సిందే.

### ర్యాంకింగ్‌లపై ప్రభుత్వ వైఖరి

అయితే, ఇలాంటి గ్లోబల్ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్‌లను భారత ప్రభుత్వం అంగీకరించడం లేదు. కొన్ని ప్రైవేట్ సంస్థలు ఏకపక్షంగా నిర్ణయించిన పారామీటర్ల ఆధారంగా ఈ నివేదికలను రూపొందిస్తున్నాయని కేంద్రం భావిస్తోంది. దీనిపై విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ గత జులై 31న లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. "పాస్‌పోర్ట్‌లకు ర్యాంకులు ఇవ్వడానికి ప్రపంచవ్యాప్తంగా ఆమోదయోగ్యమైన ప్రమాణాలు లేవు. అందుకే ఏ ర్యాంకింగ్ వ్యవస్థను ప్రామాణికంగా తీసుకోలేం" అని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# హైదరాబాద్‌లో భూగర్భ జలాల డేంజర్ బెల్స్

వర్షాకాలం ముగింపు దశకు చేరుకున్నా గ్రేటర్ హైదరాబాద్ వాసులను భూగర్భ జలాల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, మరోవైపు నీటి వినియోగం భారీగా పెరగడంతో భూగర్భ జలాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టు నాటికి సగటు భూగర్భ జలమట్టం ఏకంగా 4.84 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భూగర్భ జలవనరుల శాఖ విశ్లేషణ ప్రకారం.. ఆగస్టు చివరి నాటికి గ్రేటర్ పరిధిలో సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 360 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 22 శాతం తక్కువ. వర్షపాతం లోటు కారణంగా నగరవాసులు తాగునీరు, ఇతర అవసరాల కోసం బోర్లపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ రెట్టింపు ప్రభావంతో భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటిపోయాయి. గతేడాది ఆగస్టులో సగటున 6.36 మీటర్ల లోతులో లభ్యమైన భూగర్భ జలాలు, ప్రస్తుతం 11.20 మీటర్ల లోతుకు పడిపోయాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, బాచుపల్లి, శేరిలింగంపల్లి, దుండిగల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ వంటి కీలక మండలాల్లో భూగర్భ జలాలు 15 నుంచి 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి. అత్యంత దారుణంగా కుత్బుల్లాపూర్ మండలంలో నీటిమట్టాలు 39 మీటర్లకు పైగా లోతుకు పడిపోవడం గమనార్హం. గ్రేటర్ పరిధిలోని మొత్తం 73 శాతం ప్రాంతంలో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే దిగువన ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెలలో భారీ వర్షాలు కురిసి, భూగర్భ జలాలు తిరిగి పుంజుకుంటేనే కొంత ఉపశమనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. లేనిపక్షంలో రానున్న వేసవిలో భాగ్యనగరవాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరిస్తున్నారు. సెప్టెంబర్ వర్షపాతమే హైదరాబాద్ భవిష్యత్ నీటి భద్రతను నిర్ధారిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# భారత్, కివీస్ కీలక ఒప్పందం.. 95%ఎగుమతులపై పన్ను రాయితీలు

భారత్ న్యూజిలాండ్ మధ్య వాణిజ్య సంబంధాల్లో కీలక ముందడుగు పడింది. ఇరు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అమలుకు అవసరమైన బిల్లును న్యూజిలాండ్ పార్లమెంట్ ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 93 మంది ఎంపీలు ఓటేయగా.. 29 మంది వ్యతిరేకించారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన వెంటనే న్యూజిలాండ్ నుంచి భారత్‌కు వెళ్లే ఎగుమతుల్లో 57 శాతానికి సుంకం ఉండదు. పూర్తిస్థాయిలో అమలు జరిగితే 95 శాతం ఎగుమతులపై సుంకాలు పూర్తిగా తొలగిపోవడం లేదా భారీగా తగ్గడం జరుగుతుంది. దీంతో భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు మరింత అవకాశం దక్కనుంది. కివీ పండ్ల పరిశ్రమకు ఈ ఒప్పందం భారీ ఊరటనివ్వనుంది. వచ్చే ఐదేళ్లలో సుంకాల రూపంలో సుమారు 125 మిలియన్ న్యూజిలాండ్ డాలర్లు ఆదా అవుతాయని అంచనా. సరిహద్దుల్లో సరకుల తనిఖీ, క్లియరెన్స్ ప్రక్రియ కూడా వేగవంతం కానుంది. భారత్‌లో పెరుగుతున్న మధ్యతరగతి.. న్యూజిలాండ్ ఎగుమతిదారులకు పెద్ద మార్కెట్‌గా మారుతోందని ఆ దేశ వాణిజ్య, పెట్టుబడుల మంత్రి టాడ్ మెక్లే చెప్పారు. ఆహారం, టెక్నాలజీ, విద్య, పర్యాటకం, ప్రొఫెషనల్ సర్వీసెస్‌కు భారత్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను న్యూజిలాండ్ కంపెనీలు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఇరు దేశాల ఆమోద ప్రక్రియలు పూర్తయిన తర్వాత ఎఫ్‌టీఏ అమల్లోకి వస్తుంది. ఈ ఏడాది చివర్లోనే ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని మెక్లే చెప్పారు. 2030 నాటికి భారత్‌న్యూజిలాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా.. వెస్ట్‌పాక్ ఇన్‌స్టిట్యూషనల్ బ్యాంక్ ఇటీవల ఇచ్చిన నివేదికలోనూ భారత్ వృద్ధి అవకాశాలను ప్రస్తావించింది. ఎఫ్‌టీఏ వల్ల వచ్చే పదేళ్లలో న్యూజిలాండ్ జీడీపీకి దాదాపు 0.1 శాతం అదనపు వృద్ధి రావచ్చని అంచనా వేసింది.

# కేసీఆర్ భూదోపిడీపై విచారణ

హైదరాబాద్ : ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు రూ. లక్ష కోట్ల భూదోపిడీకి పాల్పడ్డారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వ భూములు, వక్ఫ్, దేవాదాయ, ఫారెస్టు, అసైన్డ్, ఇనాం, వివాదాల్లోని భూములు... ఇలా కల్వకుంట్ల కుటుంబం వేటినీ వదిలిపెట్టలేదన్నారు. బుధవారం శాసనసభలో 22ఏపై జరిగిన స్వల్పకాలిక చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. భూ రక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలను ఉల్లంఘించి, భూములను కొల్లాగొట్టారని చెప్పారు. మొత్తంగా కల్వకుంట్ల కుటుంబం 440 ఎకరాల భూమిని ఆక్రమించిందన్నారు. అంత భూమి ఎలా వచ్చిందో కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. చట్టాలను విధ్వంసం చేసి, పేదల భూములను లాక్కున్నారని చెప్పారు. ఈ వ్యవహారంపై ప్రత్యేక విచారణ బృందం(ఎస్ఈటీ) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ బృందం కేసీఆర్ కుటుంబంతో పాటు ధరణి అక్రమాలపై 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భూములపై కోర్టు కేసులు, వివాదాలతో కొంత ఆలస్యమైనా కేసీఆర్ భూదోపిడీని నిగ్గుతేలుస్తామన్నారు. భూ దోపిడీకి పాల్పడిన ఆ కుటుంబం జైలుకుపోక తప్పదని హెచ్చరించారు. కేసీఆర్ బినామీ బోయినపల్లి శ్రీనివాసరావు వట్టినాగులపల్లిలో ప్రభుత్వ భూమికి సేల్ డీడ్ చేసినట్టు బహిర్గతమైందని చెప్పారు. భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి పార్టీ ఫిరాయించినందుకు ఆయన పేరిట 106 ఎకరాల ఫారెస్ట్ భూమిని పట్టాగా మార్చారని తెలిపారు. అటవీ శాఖ అధికారులు కోర్టుకు పోతే ఆ భూమి ప్రయివేటు భూమి అంటూ కలెక్టర్ నివేదించారంటే, కేసీఆర్ కుటుంబం ఏ రకంగా భూ విధ్వంసానికి పాల్పడిందో అర్థమవుతోందన్నారు. బహదూర్‌గూడలో 77 ఎకరాల భూములు ఎలా అన్యాక్రాంతమయ్యాయో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి లేఖ రాయాలని సూచించారు. ఓ పత్రిక ఎమ్‌డీకి బెంజ్‌కార్లు ఎలా వచ్చాయో, అందుకు ప్రతిఫలంగా గోల్డ్ స్టోన్ ప్రసాద్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మేలు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

*** ధరణి అడ్డం పెట్టుకుని... భూదాన్ భూముల పట్టా**

ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని భూదాన్ భూములకు ఇబ్బడి ముబ్బడిగా పట్టాలు ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. సిరిసిల్లలో ఎనిమిదివేల ఎకరాల అసైన్డ్ భూములు బదలాయించారని తెలిపారు. సందీప్ ఝాను కలెక్టర్‌గా వేస్తే రెండువేల ఎకరాలను బయటకు తీశారని తెలిపారు. శంషాబాద్ ఎయిర్ పోర్టు చుట్టు పక్కల మైహోం రామేశ్వర రావుకు 2,647 ఎకరాల భూమి కట్టబెట్టారన్నారు. ప్రజల సొమ్మును ఇష్టం వచ్చినట్టు కొల్లగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేళ్ల చెరువులో ధరణి ద్వారా భూదాన భూమికి పట్టా ఇచ్చారని ఆధారాలను బహిర్గతం చేశారు. మైహోం కంపెనీకి 113 ఎకరాలు సిమెంట్ ఫ్యాక్టరీ కి వాడుకుంటున్నారని తెలిపారు. అసైన్డ్ భూములు... వక్ఫ్ భూములన్నీ మై హోమ్ వాళ్ళు లాక్కోవచ్చా? అని నిలదీశారు. భూములు ఎక్కడ కనిపించినా గద్దల లెక్క వాలిపోయారని విమర్శించారు. ఈ చర్చ రాకుండా ఉండాలనే సభలో గందరగోళం చేయాలని చూశారని తెలిపారు. ఆడబిడ్డలను అడ్డంపెట్టుకుని అడ్డుకోవాలి అనుకున్నారని చెప్పారు. శిశుపాలునికి కూడా వంద తప్పులు చేస్తేనే శిక్ష పడిందని గుర్తుచేశారు. ఏ రాక్షసుడికైనా సమయం వస్తుంది... అప్పుడే శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. 22A ను అడ్డంపెట్టుకుని తమపై నిందలు వేయాలని చూశారని తెలిపారు. సంగారెడ్డిలో భూముల చిట్టా కూడా బయట పెడతానన్నారు. ఇలాంటి వాళ్లను మనం క్షమిస్తే.. మనల్ని భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు.

*** కేసీఆర్ కుటుంబం కొల్లగొట్టిన భూముల వివరాలు**

తెలంగాణాలో భూముల అంశానికి సంబంధించి 22Aపై అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. చరిత్రలో ఉద్యమాలు చేసినోళ్లు సర్వం కోల్పోయారని.. తెలంగాణ ఉద్యమకారుడు మాత్రం వేలకోట్లు సంపాదించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ కుటుంబం చెరపట్టిన భూముల వివరాలను అసెంబ్లీ వేదికగా ప్రకటించారు.

*** కేసీఆర్ భార్య శోభ పేరిట సిద్ధిపేటలో 67 ఎకరాలు భూమి**

కేటీఆర్ పేరుతో 49 ఎకరాలు, ఆయన భార్య శైలజ పేరుతో 17.50 ఎకరాలు, కుమార్తె అలేఖ్య పేరుపై 9.3 ఎకరాలు, కుమారుడు హిమాన్షు పేరుపై 46.23, తన్నీరు హరీశ్ రావు 21, అతని భార్య పేరుపై 8.50 ఎకరాలు, కల్వకుంట్ల కవితకు మహబూబ్ నగర్ లో 14 ఎకరాలు, కవిత భర్త అనిల్‌కు 23 ఎకరాలు, జోగినిపల్లి సంతోష్ రావు తండ్రి పేరుపై 53.16 ఎకరాలు, సంతోష్‌రావు పేరుతో 18.21 ఎకరాలు, సంతోష్‌రావు భార్య పేరుతో 7.23 ఎకరాలు, మాజీ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ 52 ఎకరాలు, కొండల్ రావు 48 ఎకరాలు, మొత్తంగా తొమ్మిది జిల్లాల్లో. 24 మండలాల్లో, 31 గ్రామాల్లో 440 ఎకరాల భూమి కేసీఆర్ కుటుంబం పేరిట ఉన్నది.

# గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించాలి

*** జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని కమ్యూనల్‌గా సున్నితమైన, మిశ్రమ జనాభా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మండపాల నిర్వాహకులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. మండపాల వద్ద 24 గంటల పాటు వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని, నిర్వాహకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చూడాలని, మండపం పరిసరాలు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలు స్పష్టంగా కనిపించే విధంగా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి గణేష్ మండపాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు జియో ట్యాగింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు, జనరేటర్లు తదితరాలను సురక్షితంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద అవసరమైన అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన సౌండ్ సిస్టమ్‌ను నిబంధనల ప్రకారం మాత్రమే వినియోగించాలని, నిర్ణీత సమయం అనంతరం శబ్ద కాలుష్యాన్ని పూర్తిగా నిలిపివేయాలని



ఎస్పీ తెలిపారు. ఇతర మతాల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి పాటలు, నినాదాలు లేదా కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. మండపాలకు వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, తప్పుడు ప్రచారాలను నమ్మకుండా, వాటిని ఫార్వర్డ్ చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సున్నిత ప్రాంతాల్లో పోలీసుల నిరంతర నిఘా, పెట్రోలింగ్, బందోబస్తు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సోదరభావంతో, అన్ని వర్గాల ప్రజల మనోభావాలను గౌరవిస్తూ నిర్వహించేందుకు గణేష్ మండపాల నిర్వాహకులు, ప్రజలు పోలీస్ శాఖకు పూర్తిగా సహకరించాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వెంట నల్లగొండ డీఎస్పీ కే. శివరాం రెడ్డి, ఎస్బీ సీఐ నాగరాజు, నల్లగొండ 1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రీసర్వే పనులను వేగవంతం చేయాలి



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): మండలంలోని రామకిష్టాపూర్ గ్రామంలో కొనసాగుతున్న నాన్‌కెడస్ట్రల్ భూముల రీసర్వే ప్రక్రియను రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. అశోక్‌కుమార్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీసర్వే పనుల పురోగతి, సర్వే విధానం, భూ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రీసర్వే అనంతరం రూపొందించే డిజిటల్ భూ రికార్డులు పక్కాగా, పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమకుమారి, తహసీల్దార్ స్వరూపరాణి, రెవెన్యూ, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు నాణ్యమైన సహాయ ఉపకరణాలు

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి: ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు అవసరమైన సహాయ ఉపకరణాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రం లోని కోర్టు ఎదురుగా ఉన్న జెడ్పీహెచ్ ఎస్ బాలికల పాఠశాలలో సమగ్ర శిక్ష, అలిమ్కో సంయుక్త ఆధ్వర్యంలో సహాయ ఉపకరణాల గుర్తింపు, నిర్ధారణ శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిబిరానికి వచ్చిన పిల్లలకు వైద్య పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. పిల్లలు, తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భోజనం, తాగునీరు తదితర వసతులు కల్పించాలని సూచించారు. పిల్లల సమస్యలను వైద్యులకు స్పష్టంగా వివరించాలని తల్లిదండ్రులకు తెలిపారు. శిబిరానికి సుమారు 149 మంది ప్రత్యేక అవసరాల బాలబాలికలు హాజరుకాగా, ALIMCO వైద్య, సాంకేతిక బృందం పరీక్షలు నిర్వహిస్తోంది. నిర్ధారణ అనంతరం అవసరాన్ని బట్టి ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, చేతికర్రలు, కాలిపర్స్, హియరింగ్ ఎయిడ్స్ తదితర సహాయ ఉపకరణాలను అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్. ప్రకాష్, సీఎంఓ నాగరాజు, వైద్యులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన

*** ఎస్పీ నితికా పంత్**



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా, ప్రజా స్ఫూర్తి: గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎస్పీ నితికా పంత్, బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పలు గణేష్ మండపాలను సందర్శించి భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. మండపాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వివరాలు, బందోబస్తు పాయింట్లు, సిబ్బంది అప్రమత్తత తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. ప్రతి మండపం వద్ద నిర్వహిస్తున్న పాయింట్ బుక్‌లను తనిఖీ చేసి, విధుల్లో భాగంగా సిబ్బంది నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించారు. గణేష్ మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా, సురక్షితంగా జరిగేలా పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దిన్, టౌన్ సీఐ ప్రేమ్ కుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది

**: మార్తినేని ధర్మారావు**

జనగామ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చి డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు చేయడం ఖాయమని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితంలో పేదలు, అట్టడుగు వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. 'సేవా సంకల్ప్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనను గాలికి వదిలేసిందని ధర్మారావు విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ చేసిన తప్పులనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే పేదలు, రైతులు, నిరుద్యోగుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు ఉడుగుల రమేష్, శివరాజ్ యాదవ్, కొంతం శ్రీనివాస్, తోకల ఉమారాణి, ఐలోని అంజిరెడ్డి, బూరుగు సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌నగర్‌లో డ్రైనేజీ గుంతలతో ప్రజలకు అవస్థలు

*** వర్షా కాలంలో ప్రమాదకరంగా మారుతున్న రహదారులు**

*** చిన్నారుల భద్రతపై ఆందోళన**

మూసాపేట, ప్రజా స్ఫూర్తి : మూసాపేట పరిధిలోని భారత్‌నగర్ ఈడబ్ల్యుహెచ్ఎస్ 727 ప్రాంతంలో డ్రైనేజీ సమస్యలు, రహదారిపై ఏర్పడిన గుంతలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరడంతో అవి కనిపించకపోవడం వల్ల వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి



నెలకొంది. ప్రత్యేకంగా చిన్నపిల్లలు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్ చుట్టూ రహదారి దెబ్బతినడంతో పాటు పక్కనే పెద్ద గుంత ఏర్పడిన దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ సమస్యపై కాలనీకి చెందిన అభిలాష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని, వర్షాకాలంలో మరిన్ని ప్రమాదాలు జరగకుండా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి

భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు చేసిన కృషిని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ అభినందించారు. భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రీప్రైమరీ పాఠశాలలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, మౌలిక వసతులను పరిశీలించారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు వాహనాలు ఏర్పాటు చేసుకుని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దీంతో విద్యార్థుల ప్రవేశాలు దాదాపు 50 శాతం పెరిగాయి. ఈ విషయంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు మరింత పెరిగేలా ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పాఠశాలలోని సైన్స్ ల్యాబ్‌ను



పరిశీలించిన కలెక్టర్.. విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ వసతులను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**విద్యార్థులతో ముఖాముఖి**

పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. వారి చదువు, భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ మరుగుదొడ్లను కూడా పరిశీలించారు. పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్క నాటారు. కార్యక్రమంలో డీఈఓ లలిత, సర్పంచ్ శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

*** నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులుగా డిజిటలైజ్ చేసి పంపిణీ చేయడం సంతోషకరమైన విషయమని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బుధవారం ఆమె నల్లగొండ పట్టణంలోని పచ్చల సోమేశ్వరాలయంలో (1,వ డివిజన్‌లో) స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. నల్లగొండ పట్టణంలోని 48 డివిజన్ల పరిధిలో 42,855 స్మార్ట్ రేషన్ కార్డులు మం



జూరయ్యాయని, వాటిని ఆయా వార్డుల్లో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో స్మార్ట్ రేషన్ కార్డుల విధానం అమలు చేస్తున్నామని, దీనివల్ల రేషన్ పంపిణీలో పారదర్శకత పెరిగి అవకతవకలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ రేషన్ షాప్‌లో బియ్యం తీసుకోవాలని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. పట్టణంలో రోడ్లు, రింగ్ రోడ్లు, వాటర్ ట్యాంకులు, లతీఫ్‌సాబ్ గుట్టకు ఘాట్ రోడ్డు, అండర్ డ్రైనేజీ తదితర పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మేయర్ కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరుశురాములు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ నాగరాజు, వేణుగోపాల్ రెడ్డి, వార్డు ఆఫీసర్ అనిల్, ప్రజలు పాల్గొన్నారు.

## రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాలు మంజూరు చేయాలి

*** అసెంబ్లీలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

ప్రజాస్ఫూర్తి, షాద్నగర్: 22ఏ నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త మండలాలను ఏర్పాటు చేసినప్పటికీ, అనేక మండలాల్లో ఇప్పటికీ రెవెన్యూ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కొత్తగా ఏర్పడిన మండలాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకంగా జిల్లేడు చౌదరిగూడ మండలంలో తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అక్కడ తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫరూఖ్ నగర్ తహశీల్దార్ కార్యాలయ భవనం కూడా శిథిలావస్థకు చేరిందని నూతన భవనం మంజూరు చేయాలని కోరారు. అలాగే లింగారెడ్డిగూడ గ్రామంలో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన భవనంలో



కొనసాగుతున్న రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కార్యాలయానికి కూడా సొంత భవనం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. షాద్ నగర్ నియోజకవర్గం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎత్తున రెవెన్యూ వస్తుందని తెలిపారు. ఇప్పటికే నందిగామ తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.

## దాతల సహకారంతో దేవాలయాల అభివృద్ధి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: దాతల సహకారంతో దేవాదాయాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి అన్నారు. గరిడేపల్లి మండల కేంద్రంలోని బుధవారం గ్రామానికి చెందిన కర్నె అరుణ లక్ష్మీనారాయణ సుమారు 15 వేలు ఖర్చుతో గ్రామంలో ని పాండవుల వారి దగ్గర బోరును కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అంజన్ రెడ్డి మాట్లాడుతూ, దాతల సహకారంతో దేవాలయాల అభివృద్ధి జరగడం శుభ పరిణామం అని దాతలు ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆయన కోరారు.. ఇట్టి కార్యక్రమంలో గరిడేపల్లి సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ రెండో వార్డ్ నెంబర్ కర్నే అరుణ లక్ష్మీనారాయణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకపోతులఅఖిల్ గరిడేపల్లి యూత్ కాంగ్రెస పార్టీ అధ్యక్షులు కానుగు అనిల్ మత్స్య సహకార సంఘం చైర్మన్ చామకూరి దశరథ వైస్ చైర్మన్ ప్రధాని వెంకన్న డైరెక్టర్ ప్రధాని అమరయ్య కుల పెద్దమనిషి చామకూర హరీష్ లింగం నాగయ్య చామకూరి అప్పయ్య పాల్గొన్నారు.

## బీసీల రాజ్యాధికార పాదయాత్రకు తరలిరావాలి

*** రవి పటేల్ పిలుపు**



భూపాలపల్లి, (ప్రజాస్ఫూర్తి) : బీసీల రాజ్యాధికారం, సామాజిక సమానత్వం లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న 14,500 కిలోమీటర్ల పాదయాత్రను బుధవారం హైదరాబాద్‌లోని గోల్కొండ నుంచి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రను దశలవారీగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు, సామాజిక న్యాయాన్ని కోరుకునే వారు పెద్ద సంఖ్యలో గోల్కొండకు తరలివచ్చి పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని మద్దతు ఇవ్వాలని రవి పటేల్ కోరారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సామాజిక న్యాయం కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు ప్రణయ్ రాజ్, వెంకటేష్, సంతోష్, శ్రీను, రాంబాబు, సతీష్, ముక్తేశ్వర్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శక ఓటరు జాబితాకు పార్టీలు సహకరించాలని కలెక్టర్ పిలుపు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : పారదర్శక ఓటరు జాబితా తయారీలో అన్ని రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కోరారు. ఎవరి ఓటును నిబంధనలకు విరుద్ధంగా తొలగించబోమని స్పష్టం చేశారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం అన్ని పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం జరుగుతోంది. ఇప్పటి వరకు 88,800 మందికి నోటీసులు ఇచ్చాం. వారు గుర్తింపు కార్డులతో బీఎల్ఓలను కలిసి వివరాలు నమోదు చేసుకోవాలి. పార్టీలు తమ బీఎల్ఏల ద్వారా ప్రచారం కల్పించాలి. డబుల్, మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు పారదర్శకంగా జరుగుతుంది" అని కలెక్టర్ తెలిపారు. బీఎల్ఓల వేతనాల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సురేష్ నాయుడు, బీఆర్ఎస్ మార్నేని వెంకన్న, బీజేపీ శ్యాం సుందర్ శర్మ, టీడీపీ పీబీ రామారావు, బీఎస్పీ విజయ్ కాంత్, సీపీఐ విజయ్ సారథి తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 18 న జరిగే సూర్యాపేట బందును జయప్రదం చేయాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: బుల్లెట్ ట్రైన్ సాధన కోసం చేస్తున్న ఉద్యమ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 18న అఖిలపక్షాల ఆధ్వర్యంలో తలపెట్టిన సూర్యాపేట బందును విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత 60 రోజులుగా పట్టణంలో బుల్లెట్ సాధన కోసం కొనసాగుతున్న ఉద్యమ కార్యక్రమాలతో పాటు 34 రోజులుగా దీక్ష కొనసాగుతుందని అయినా పాలకులు స్పందించకపోవడంతో సూర్యాపేట జిల్లా బందుకు పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. ప్రజల వ్యాపార వాణిజ్య సంస్థలతో పాటు అన్ని వర్గాల సంఘాల భాగస్వామ్యంతో ఈ బందుకు పిలుపునిచ్చినట్లు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా బందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీనివాస్, రమణాచారి, ధర్మార్జున్, చల్లమల్ల నరసింహ, బూర మల్సూర్ గౌడ్, సలిగంటి వీరేంద్ర, బూర వెంకటేశ్వర్లు, కురుకుంట్ల సైదులు, సకినాల కృష్ణ, జీడి బిక్షం, కోడి లింగయ్య, సాయి,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

*** ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**



జనగామ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సెప్టెం బర్ 17న నిర్వహించనున్న వేడుకలకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐ లయ్య ముఖ్య అతిథిగా హాజరుకాను న్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. వేడుకల్లో భాగంగా ముఖ్య అ తిథికి పోలీసు గౌరవ వందనం,జాతీయ గేయాలాపన అనంతరం జాతీయ పతా కావిష్కరణ నిర్వహించనున్నారు.అనం తరం జాతీయ గీతం, పోలీసు గౌరవ వందనం, తెలంగాణ రాష్ట్ర గీతం'జయ జయహే తెలంగాణ' ఆలపిస్తారు. ము ఖ్య అతిథి తెలంగాణ ప్రజాపాలన దినో త్సవ సందేశం ఇవ్వనున్నారు. అనంత రం విద్యార్థులు, కళాబృందాల ఆధ్వ ర్యం లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని వినతి



ప్రజాస్ఫూర్తి , జన్నారం : మహ్మదాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని సాయిని ప్రసాద్ నేత ఆధ్వర్యంలో మహ్మదాబాద్ గ్రామ సర్పంచ్ రామటెంకి శంకర్, ఉపసర్పంచ్ సింగం కిష్టయ్య జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య కి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహమ్మదాబాద్ గ్రామపంచాయతీ నిర్మాణం కోసం గ్రామ పరిధిలో ఉన్న స్థలాన్ని కేటాయించి నిర్మాణానికి సహకరించాలని సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ సింగం కిష్టయ్య జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య కోరారు. గ్రామపంచాయతీ భవనం పాలకవర్గానికి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కావున ఇట్టి విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపౌరులు హసన్ పాల్గొనారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షునిగా కొలను శ్రీనివాస్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షునిగా, తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన, చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామ మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ నియామకపు ఉత్తర్వులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు కొలను శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ కారుల హక్కుల కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వానికి ఉద్యమకారులకు వారధిగా పనిచేయడమే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఉద్యమకారుల హక్కుల సాధన లక్ష్యంగా పని చేస్తానని హామీ ఇచ్చారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

*** మాజీ ఎమ్మెల్యే గడ్డి గారి విఠల్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా బైంసా పట్టణ కేంద్రంలో ప్రముఖ పారిశ్రామికవేత్త అశోక్ లడ్డ కుమారుడు ఇటీవల స్వర్గస్తులైనారు విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు గడ్డి గారి విఠల్ రెడ్డి ఈరోజు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది.మాజీ శాసనసభ్యులు వెంట ఏఎంసి వైస్ చైర్మన్ ఎండి ఫారుక్ అహ్మద్, మాజీ ఏఎంసీ చైర్మన్ మురళి గౌడ్,సీనియర్ నాయకులు రమేష్ మా శెట్టివార్,న్యాయవాది సంతోష్ ఉన్నారు.

# ఆరవ వసంతంలోకి అడుగుపెట్టిన చౌటుప్పల్ కోర్టు

- **న్యాయ సేవలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చౌటుప్పల్ కోర్టు**
- **చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ కోర్టు నేటితో ఐదు సంవత్సరాల న్యాయ సేవలను పూర్తిచేసుకుని ఆరవ పడిలోకి అడుగుపెట్టడం సంతోషంగా ఉందని చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రామన్నపేటలో కోర్టు ఉండటంతో, చౌటుప్పల్ నుంచి వ్యయ ప్రయాసలకోర్చి ప్రజలు కోర్టు కేసులకు వెళ్లేవారన్నారు. చిన్నచిన్న కేసుల్లో సైతం చౌటుప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలు రామన్నపేట కోర్టుకు వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండి వచ్చే వారని గుర్తు చేశారు. జాతీయ రహదారి వెంట, పరిసర మండలాల ప్రజలకు అనువైనదిగా ఉన్న చౌటుప్పల్ లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదన, 2021సెప్టెంబర్ 16వ తేదీన చౌటుప్పల్ లో కోర్టు ఏర్పాటు అయిందన్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న చౌటుప్పల్ మండల కేంద్రంలో చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు 2021లో ప్రారంభమై, నేటికి విజయవంతంగా ఐదు సంవత్సరాల న్యాయ సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ ఐదేళ్ల కాలంలో స్థానిక ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, సులభతరమైన న్యాయ సేవలను అందించడంలో ఈ కోర్టు కీలక పాత్ర పోషించింది. 2021లో ఏర్పాటైన నాటి నుంచి చౌటుప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలకు సుదీర్ఘ దూరాలు ప్రయాణించాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే న్యాయం చేకూరుతోందన్నారు. గత ఐదేళ్లలో ఎన్నో సివిల్ మరియు క్రిమినల్ కేసులను చట్టపరంగా, నిష్పక్షపాతంగా పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం జరిగిందన్నారు. కోర్టు పరిధిలో చట్టాలపై ప్రజలకు, మహిళలకు, యువతకు అవగాహన కల్పించేందుకు పలు ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సులు విజయవంతంగా నిర్వహించబడ్డాయన్నారు. రాజీపడదగ్గ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి, కోర్టులపై కేసుల భారాన్ని తగ్గించడంలో ఈ న్యాయస్థానం ఎంతో కృషి చేసిందన్నారు. ఈ ఐదేళ్ల విజయవంతమైన ప్రస్థానానికి సహకరించిన న్యాయమూర్తులు,కోర్టు సిబ్బంది, లాయర్లు, పోలీస్ శాఖ, స్థానిక ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లోనూ ఇదే విధమైన పారదర్శకతతో, మరింత వేగంగా ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు కోర్టు నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

## ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- **హుస్నాబాద్ మండల బిజెపి అధ్యక్షుడు భూక్యా సంపత్ నాయక్**



హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి : సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ హుస్నాబాద్ మండలశాఖ అధ్యక్షుడు బుక్యా సంపత్ నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ నాయక్ మాట్లాడుతూ. నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన సెప్టెంబర్ 17ను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని కోరారు. తెలంగాణ విమోచన పోరాటంలో అమరులైన వారి త్యాగాలను నేటి తరానికి తెలియజేయడంతోపాటు, వారి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. చారిత్రక అంశాలను వాస్తవాల ఆధారంగా ప్రజలకు తెలియజేసేలా సెప్టెంబర్ 17న అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు బైరి అరుణ్, తడిసిన రమేష్ రెడ్డి, బూతగడ్డపు బాలరాజు ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు పూదరి కిష్టయ్య, యువమోర్చా మండల అధ్యక్షుడు సొల్లు రజినీకాంత్ నాయకులు కుంట మల్లయ్య, మెరుగు రవీందర్ పెనాల శ్రీనివాస్, బొల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను త్రైమాసిక తనిఖీ చేసిన ఇంచార్జి జిల్లా కలెక్టర్

- **భాస్కరరావు**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ఈవీఎం/వీవీప్యాట్ గోదాం త్రైమాసిక తనిఖీలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంను ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం గోదాం సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి, ఈవీఎంలు,బ్యాలెట్ యూనిట్లు,కంట్రోల్ యూనిట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కూడా తనిఖీ చేశారు.ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గోదాం భద్రత, పర్యవేక్షణకు సంబంధించిన ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం. కృష్ణ, డీటీటీ సురేష్ బాబు, సీనియర్ సహాయకులు కె. శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ బర్రె జహంగీర్, మజర్, బీఆర్ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఏ. ఆంజనేయులు, భువనగిరి పట్టణ అధ్యక్షులు ఏ.వి. కిరణ్ కుమార్, కార్యదర్శి రచ్చ శ్రీను, బీజేపీ నాయకులు చందా మహేందర్ గుప్తా, పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, సీపీఎం నాయకురాలు భట్టుపల్లి అనురాధ, బీఎస్పీ నాయకులు భట్టు రాంచంద్రయ్యతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అమెరికా ఒత్తిడికి తలొగ్గి ప్రజలపై పన్నుల మోత




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఉచితం పేరుతో ప్రజలందరినీ యూపీఐ చెల్లింపులకు అలవాటు చేసి, ఇప్పుడు వాటిపై పన్ను వేసి భారం మోపాలని చూస్తున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వ వైఖరిని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి తీవ్రంగా ఖండించారు.మహబూబాబాద్ లో బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "జిఎస్టి పేరుతోనే ఇప్పటికే ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు.ఇప్పుడు యూపీఐ పై కూడా పన్ను వేయడం అత్యంత మోసపూరితం, ప్రజా వ్యతిరేక చర్య" అని ధ్వజమెత్తారు. వీసా,మాస్టర్ కార్డ్ వంటి అమెరికా కంపెనీల లావాదేవీలకు యూపీఐ దెబ్బ కొడుతుందనే కారణంతో,అమెరికా ఒత్తిడికి లొంగి మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని విమర్శించారు.కోట్లాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు వాడుతున్న యూపీఐ పై పన్ను వేయడాన్ని వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 17,18 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

## సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని
# నేటి తరానికి చాటాల్సిన అవసరం ఉంది



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం త్యాగాలను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని,ఆ పోరాట చరిత్రను నేటి తరానికి చేరవేయాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పట్టణంలోని 16వ వార్డు ఎల్బీజీ నగర్‌లో బుధవారం నిర్వహించిన 1వ, 2వ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆకుల సతీష్ అధ్యక్షత వహించారు."నిజాం రాచరికం, రజాకార్ల అరాచకాలు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా 1946 48లో సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రజా ఉద్యమ చరిత్రలో చెరగని అధ్యాయం. ఇది అధికారం కోసం కాదు,పేదల ఆత్మగౌరవం కోసం సాగిన పోరాటం. వెట్టి చాకిరీకి,అక్రమ పన్నులకు వ్యతిరేకంగా 'దున్నేవాడికే భూమి' నినాదంతో గ్రామాలను కేంద్రాలుగా చేసుకుని ప్రజలు తిరుగుబాటు చేశారు. ఈ పోరాటంలో 4 వేల మంది అమరులయ్యారు, 10 లక్షల ఎకరాలు పేదలకు పంచారు. మహిళలు తుపాకులు పట్టి పోరాడారు" అని ఆయన గుర్తుచేశారు.సెప్టెంబర్ 17న మహబూబాబాద్ విఆర్ఎన్ గార్డెన్ లో జరగనున్న సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభను పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో శాఖ కార్యదర్శులు బడుగుల లక్ష్మయ్య, బానోత్ లింగ,పాటి సారయ్య,ఎస్. కె. ముఖరంజన్, బానోత్ కిరణ్ కుమార్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక చవితి సందర్భంగా డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగంపై ముందస్తు చర్యలు

- **14మంది డిజే ఆపరేటర్లను బైండోవర్ చేసిన ఎస్సై జగదీశ్వర్**



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని 17గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా డిజె సిస్టమ్స్ వినియోగించడంపై ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చిగురుమామిడి ఎస్ఐ జగదీశ్వర్ హెచ్చరించారు. చిగురుమామిడి మండలంలోని 14మంది డీజే ఆపరేటర్లను తహసిల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగిందన్నారు.ఎస్సై జగదీశ్వర్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు,నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.వినాయక చవితి ఉత్సవాలు,ఊరేగింపుల సమయంలో డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదని వారికి స్పష్టంగా సూచించడంతో పాటు,పోలీసుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించడం జరిగిందన్నారు.ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా,శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరఫున అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై వివరించారు.

## అక్రమంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకుంటున్న వాటిపై

**చర్యలు తీసుకోవాలని వినతి**




ప్రజాస్ఫూర్తి, జన్నారం : జన్నారం మండలంలోని కవ్వాల్ గ్రామపంచాయతీ సర్పంచ్ లకావత్ సక్రు నాయక్ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా తమ గ్రామపంచాయతీ పరిధిలో లేనివారు కొందరు అక్రమంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకుంటున్నారని వాటిపై విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని జన్నారం తహసిల్దార్ బక్కయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా తమ గ్రామ పంచాయతీ పరిధిలో నివాసం లేని వారు, ఇంటి పన్ను రసీదులు లేదా ఇతర నివాసానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేని వ్యక్తులు కూడా తమ గ్రామ పంచాయతీ పరిధిలో నివసించకుండానే, వేరే గ్రామపంచాయతీ పరిధిలో నివసిస్తూ తమ గ్రామపంచాయతీ పరిధిలో ఎస్ ఐ ఆర్ లో భాగంగా ఓటు హక్కు కోసం ఓటర్ లిస్టులో పేరు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కావున అలాంటి వారిపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ ని కోరారు.

## అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: సీపీ రమేష్



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసు, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ అధికారులను ఆదేశించారు. నిమజ్జన ఏర్పాట్లపై బుధవారం సైబరాబాద్ పోలీసులు, సైబరాబాద్ మునిసిపల్ అధికారులతో సంయుక్తంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన.. అనంతరం కమిషనరేట్ పరిధిలోని పలు నిమజ్జన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఐడీపీఎల్, సూరారం తదితర చెరువుల వద్ద నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లను సీపీ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సైబరాబాద్ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సంయుక్తంగా పనిచేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడ్లు, విద్యుత్తు దీపాలు, గజ ఈతగాళ్ల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ జి. సృజన, మున్సిపల్ జోనల్ కమిషనర్లు, జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీ కోటి రెడ్డి, డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిణి రెడ్డి, ఎస్బీ డీసీపీ సువేంద్ర, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీసు సిబ్బందితో పాటు విద్యుత్తు, మున్సిపల్, రెవెన్యూ, దేవాదాయ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏఐకేఎంఎస్ మహాసభలను జయప్రదం చేయాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : దేశవ్యాప్తంగా రైతులు,వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మండల వెంకన్న అన్నారు. వారి హక్కుల సాధనకు ఖమ్మంలో జరిగే జాతీయ మహాసభలు దోహదపడతాయని తెలిపారు. ఈనెల 28, 29, 30 తేదీలలో ఖమ్మంలో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాలుగవ జాతీయ మహాసభల ప్రచారంలో భాగంగా మంగళవారం మహబూబాబాద్ పట్టణంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మైస శ్రీనివాసులు, బాలాస్టి రమేష్,విష్ణువర్ధన్, కమలాకర్,సుధాకర్, రవి,రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్,నాయకులు హలవత్ లింగన్న, సామ పాపయ్య, బట్టు చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ 'ఇంటాక్' కన్వీనర్‌గా లయన్ సముద్రాల ధనంజయ్య నియామకం




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : భారతీయ జాతీయ కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) నల్గొండ చాప్టర్ నూతన కన్వీనర్‌గా దేవరకొండ పట్టణానికి చెందిన లయన్ సముద్రాల ధనంజయ్య నియమితులయ్యారు. న్యూ ఢిల్లీ లోని లోధీ ఎస్టేట్‌లో ఉన్న ఇంటాక్ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇంటాక్ జాతీయ చైర్మన్ అశోక్ సింగ్ ఠాకూర్ ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ మెంబర్ సెక్రటరీ రవీంద్ర సింగ్ (ఐఏఎస్ రిటైర్డ్), నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఇంజనీర్ వేదకుమార్ మణికొండ, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు నీల్ కమల్ మహేశ్వరి, చాప్టర్స్ డివిజన్ డైరెక్టర్ కెప్టెన్ శుక్లా మరియు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంటాక్ నల్లగొండ జిల్లా కన్వీనర్‌గా ఎన్నికైన సముద్రాల ధనంజయ్య మాట్లాడుతూ నల్గొండ జిల్లాలోని ప్రాచీన దేవాలయాలు, కోటలు, బౌద్ధ అవశేషాలు, జానపద కళలు, హస్తకళల డాక్యుమెంటేషన్ మరియు పరిరక్షణకు సమగ్ర ప్రణాళికతో పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

# ఘనంగా విలీన దినోత్సవం నిర్వహించాలి

*** మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్ రావు**



ప్రజాస్ఫూర్తి ,మెదక్ జిల్లా: మెదక్ బీజేపీ జిల్లా కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం, సేవా సంకల్ప్ అభియాన్ పై ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, ఈ రోజును ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, ప్రతి మండలం, పట్టణం, గ్రామ స్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా పదాధికారులు, మండల, పట్టణ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, వివిధ మోర్చాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాంపూర్ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసోత్సవం



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండలంలోని రాంపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం రోజున పోషణ మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు మరియు కిషోర బాలికల్లో ఆరోగ్యం, సరైన ఆహార అలవాట్లపై అవగాహన కలిగి ఉండాలని, పోషకాహార లోపం వల్ల పిల్లలలో మహిళల్లో రక్తహీనత ,తక్కువ బరువుతో పుట్టడం, ఎదుగుదల లోపం ఉంటుందని అందుకే నిత్యజీవితంలో లభించే ఆకుకూరలు ,కూరగాయలు పండ్లు,పాలు, గుడ్లు,తృణధాన్యాలు ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నూతి రామయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు విజయ, సుశీల, మగ్గిడి సంధ్యారాణి, ఆశా కార్యకర్త రాజమణి,గర్భవతులు బాలింతలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న 'సైబర్ సేఫ్ గణేష్

*** మండపాన్ని సందర్శించిన ఎస్పీ శబరీష్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మహబూబాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన వినూత్న "సైబర్ సేఫ్ గణేష్" మండపాన్ని జిల్లా ఎస్పీ డా. శబరీష్ సందర్శించి, నిర్వాహకులను అభినందించారు.సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ మండపాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.గణేష్ దర్శనానికి వచ్చే భక్తులకు సైబర్ మోసాలు,వాటి నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. మండపం వద్ద ఏర్పాటు చేసిన పోస్టర్ల ద్వారా బ్యాంకు అధికారుల పేరుతో ఫోన్ చేసినా ఓటిపి,పిఐఎన్,సి వి వి,పాస్‌వర్డ్‌లు చెప్పకూడదు, తెలియని లింకులపై క్లిక్ చేయకూడదు, యూపీఐ ద్వారా తెలియని వారికి డబ్బులు పంపకూడదు, ఆన్‌లైన్ గేమింగ్,ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్,లోన్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. భక్తులను ఆకట్టుకునేందుకు "నేను సైబర్ సేఫ్ మీరు సైబర్ సేఫ్" అనే ప్రత్యేక సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు.దర్శనానికి వచ్చే వారు అక్కడ సెల్ఫీలు తీసుకుంటూ సైబర్ భద్రత సందేశాన్ని సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఒకవేళ మోసపోతే వెంటనే ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్ లో 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి, http://cybercrime.gov.in పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు.అలా చేస్తే డబ్బును నిలుపుదల చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.గణేష్ ఉత్సవాలను కేవలం ఆధ్యాత్మికంగానే కాకుండా సామాజిక బాధ్యతతో ప్రజలకు ఉపయోగపడేలా నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఇంచార్జి సీఐ అంజలి,ఎస్ఐ ఉమా,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం చందా రికవరీలు నిలుదల చేయాలి

*** సిఐటియు**




ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : సింగరేణిలో గెలిచిన కార్మిక సంఘాల గుర్తింపు రెండు సంవత్సరాల కాల పరిమితి అయిపోయినందున సింగరేణిలోని రిజిస్టర్ కార్మిక సంఘాలన్నిటిని కార్మికుల సమస్యలపై మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని జీఎం పర్సనల్ అండ్ పిఎం కిరణ్ కుమార్ కు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు విజయగిరి శ్రీనివాస్, వై వెంకటేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ క్రింద స్థాయి సేఫ్టీ కమిటీ మైన్స్ కమిటీ తదితర వాటిలో అని సంఘాల వారిని ఆహ్వానించేందుకు సంబంధిత గని లేదా డిపార్ట్మెంట్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని వినతి పత్రం పేర్కొన్నారు. సింగరేణిలో 2023 డిసెంబర్ 27న రెండు సంవత్సరాల కాల పరిమితితో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగాయని, గెలిచిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు 9 నెలల ఆలస్యంగా అధికారిక ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఇప్పుడు ఆ కాలం కూడా పూర్తయినందున వెంటనే ఎలక్షన్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. అప్పటి వరకు అన్ని కార్మిక సంఘాల ను సమాన హోదా కల్పించాలని వారు కోరారు .

# గణేష్ నిమజ్జనంలో డీజేలకు నో



హత్నూర, ప్రజా స్ఫూర్తి : గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా శబ్ద కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు హత్నూర పోలీసులు కీలక సూచనలు చేశారు. హత్నూర పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే సౌండ్ ఆపరేటర్లు, గణేష్ ఉత్సవ నిర్వాహకులను బుధవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి నిబంధనలపై అవగాహన కల్పించారు. గణేష్ మండపాల వద్ద, నిమజ్జన సమయంలో సౌండ్ సిస్టమ్స్‌ను అనుమతించిన శబ్ద పరిమితుల్లోనే వినియోగించాలని పోలీసులు సూచించారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేలు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు, రోగులు, వృద్ధులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శబ్ద నియంత్రణ పాటించాలని తెలిపారు.పాఠశాలలు, ఆసుపత్రులు, మతపరమైన ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదని హెచ్చరించారు. సుప్రీం కోర్టు ఆదేశాలు, శబ్ద కాలుష్య (నియంత్రణ , నియమాలు)-2000 నిబంధనల మేరకు ఈ సూచనలు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా డీజే ఆపరేటర్లకు నోటీసులు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి గణేష్ మహోత్సవాలు లేదా నిమజ్జన కార్యక్రమాల్లో డీజేలు ఏర్పాటు చేసి వినియోగిస్తే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏఎస్ఐ గౌస్, హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య పాల్గొన్నారు. గణేష్ నిమజ్జనాన్ని శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు డీజే ఆపరేటర్లు, నిర్వాహకులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్‌హెచ్‌ఓ కోరారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట త్యాగాలు చిరస్మరణీయం



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం చుంచుపల్లి సిపిఐ పార్టీ మండల కార్యాలయం నందు మండల కార్యదర్శి , విద్యానగర్ కాలనీ ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి అధ్యక్షతన వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా రజబ్ అలీ స్థూపం వద్ద ఏఐటియుసి సీనియర్ నాయకులు శేషగిరిరావు జెండా ఆవిష్కరణ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, శ్రమజీవుల విముక్తి కోసం ఎందరో కమ్యూనిస్టులు, ప్రజలు ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాల ఫలితంగానే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజా పోరాటం విజయవంతమైందని రైతాంగ సాయుధ పోరాటంలో వేల మంది కమ్యూనిస్టు కార్యకర్తలు అమరులయ్యారని ,వారి త్యాగాలు, పోరాట స్ఫూర్తి తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని ,వారి ఆశయాలను కొనసాగించడమే వారికి నిజమైన నివాళి అని, వారి స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వీరస్వామి , సలిగంటి శ్రీనివాస్ , దుర్గరాశి వెంకన్న , ఏఎంసి వైస్ చైర్మన్ భూక్య జనార్ధన్ ,వివిధ గ్రామ సర్పంచులు , ఉప సర్పంచ్లు , వార్డ్ మెంబర్లు , మండల కమిటీ నాయకులు , మహిళలు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# రోడ్డుమార్గం ఉన్న కల్వర్ట్ లకు బ్రిడ్జి లు నిర్మించాలి

*** బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు ఐలేని మల్లికార్జున్ రెడ్డి**



హుస్నాబాద్ ,ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మండలం తోటపల్లి జనగామ గ్రామాల మధ్యన ఉన్న వాగు లో తాత్కాలిక కల్వర్ట్ వేయడం తో చిన్నపాటి వర్షం కురిసి వాగు లో వరద నీరు తో కల్వర్ట్ లు తెగిపోతున్నాయని హుస్నాబాద్ ప్రాంతం లో అక్కడ అక్కడ మెయిన్ రోడ్డు ఉన్న కల్వర్ట్ లు ఉండడం తో వాటి మీది నుండి వర్షం నీరు ప్రవహిస్తూ ఉండడం తో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారని కాబట్టి వాగులపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు ఐలెని మల్లికార్జున్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత సంవత్సరం లో వరదల్లో ముగ్గురి ప్రాణాలు కూడా కోల్పోయినారని అయినా ప్రభుత్వం మేల్కొనలేదని హుస్నాబాద్ నియోజకవర్గం లో చాలా ప్రాంతాలలో ఇదే దుస్థితి ఏర్పడి ఉంది కాబట్టి వెంటనే స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చోరువ తీసుకోని బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ యస్ పార్టీ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున రెడ్డి బి ఆర్ యస్ పార్టీ నాయకులు బానోత్ సంతోష్ నాయక్, మాటూరి రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

# టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఘనంగా గురూ సన్మాన మహోత్సవం



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న పాత్ర అమూల్యమైనదని,వారి సేవలను గుర్తించి గౌరవించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్ కాషబోయిన వీరస్వామి పేర్కొన్నారు.టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో చిన్న ములకనూరు మోడల్ స్కూల్‌లో గురూ సన్మాన మహోత్సవం కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సన్మాన మహోత్సవంలో భాగంగా విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ,నిరంతరం శ్రమిస్తున్న పాఠశాలలోని 30మంది ఉపాధ్యాయులను సంస్థ ప్రతినిధులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్ కె. వీరస్వామి,ట్రైనర్ వర్మ,అసిస్టెంట్ మేనేజర్లు శ్రీకాంత్,విజయ్ హాజరై మాట్లాడారు.గురువుల స్థానం సమాజంలో ఎంతో ఉన్నతమైనదని,వారిని సన్మానించుకోవడం తమ సంస్థకు గర్వకారణమని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య,పాఠశాల ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్,గ్రామ ఉపసర్పంచ్‌లు పైడిపల్లి వెంకటేష్,పాఠశాల సిబ్బంది,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యమ కళాకారులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

*** తెలంగాణ ఉద్యమ కళాకారుల రాష్ట్ర నాయకుడు కొండుకూరి రాజు**



ప్రజాస్ఫూర్తి , జన్నారం : తెలంగాణ ఉద్యమ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు గడిచిన కూడా ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా తెలంగాణ ఉద్యమ కళాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని తెలంగాణ ఉద్యమ కళాకారుల రాష్ట్ర నాయకుడు కొండకూరి రాజు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన శాసనసభలో కళాకారులపై కపట ప్రేమ చూపుతూ మాట్లాడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి, మంత్రి జూపల్లి కృష్ణారావు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాల కోసం మేనిఫెస్టోలో పెట్టిన జీవో ను వెంటనే అమలుపరచాలని లేనిపక్షంలో ఉద్యమ కళాకారులంతా కలిసి రవీంద్ర భారతి రిటైర్డ్ చేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్, మంత్రి జూపల్లి కృష్ణారావు , సాంస్కృతిక సారథి మంత్రులు ఉమ్మడి అదిలాబాదులో ఎక్కడ సమావేశాలు నిర్వహించిన కళాకారులంతా కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు.

# కూరగాయలతో వినాయకుని ప్రతిమ ను తయారు చేసిన ముస్లిం విద్యార్థిని



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జన్నారం మండలంలోని కలమడుగు గ్రామంలోని వివేకానంద పాఠశాలలో యూకేజీ చదువుతున్న ముస్లిం విద్యార్థిని అజీజ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కూరగాయలతో వినాయకుని ప్రతిమను తయారుచేసి అందరిని ఆకట్టుకోవడమే కాకుండా మతసామరస్యాన్ని చాటుకుంది. చిన్న వయసులోనే విద్యార్థిని అజీజా కుల మతాలకు అతీతంగా మత సామరస్యాన్ని చాటడం అభినందనీయమని, అలాగే ఆమెను ప్రోత్సహించిన తల్లిదండ్రులను పాఠశాల కరస్పాండెంట్ అమరగొండ సతీష్ గౌడ్ అభినందించారు. కూరగాయలతో వినాయకుని తయారుచేసిన విద్యార్థినిని ఉపాధ్యాయులు ,విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

# ప్రజా పాలన దినోత్సవ వేడుకల నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు



ప్రజాస్ఫూర్తి, భైంసా: రేపటి రోజున జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించబోయే సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అధికారులు విస్తృత ఏర్పాటు చేస్తున్నారు. ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ వేముల వీరేశం పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు ఆయన జాతీయ జెండాను ఎగురవేసి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొంటారు.

# ప్రపంచ క్షౌర వృత్తి దినోత్సవం సందర్భంగా ధన్వంతరికి పూజలు



హత్నూర ,ప్రజాస్ఫూర్తి : దౌల్తాబాద్ ప్రపంచ క్షౌర వృత్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని దౌల్తాబాద్ టౌన్‌లో నాయి బ్రాహ్మణుల కుల మూలపురుషుడు, వైద్య నారాయణుడైన ధన్వంతరి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు ధన్వంతరిని భక్తిశ్రద్ధలతో పూజించి, క్షౌర వృత్తి అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హత్నూర మండల నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వీరేశం నాయి, ఉపాధ్యక్షుడు రాములు నాయి, కోశాధికారి లక్ష్మణ్ నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షపతి నాయితో పాటు సంఘ సభ్యులు ఎల్లేష్ నాయి, వెంకటయ్య నాయి, వీరస్వామి నాయి, రమేష్ నాయి, నర్సింలు నాయి, ప్రదీప్ నాయి, నరేందర్ నాయి, రాజలింగం నాయి, భానుప్రసాద్ నాయి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో గణనాథుడికి పూజలు



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : షాద్ నగర్ శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో భాద్రపద మాసం మొదటి బుధవారం పురస్కరించుకొని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జమాల్పూర్ చందు సంతోషిబాయి ను శాలువాతో ఘనంగా సన్మానించి అర్చన అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు లష్కర్ ఆంజనేయులు, అంతటి కోటి లింగం గౌడ్ , వర్ష లేడీస్ కార్నర్ ప్రొప్రైటర్ కట్టా శ్రీనివాస్, సాయి మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షులు మలగారి సత్యనారాయణ, మాజీ కోఆప్షన్ నెంబర్ ఒగ్గు కిషోర్, గంధం ఆనంద్ కుమార్, యంసాని శ్రీనివాస్, ఆలయ మేనేజర్ రాజగోపాల్, అర్చకులు సంతోష్ కుమార్, రవి శర్మ, సునీల్, కిరణ్ శర్మ, గణేష్, శివ, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు అశోక స్తంభం బహుకరణ



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ గ్రామ పంచాయతీకి చెందిన సీనియర్ ఆరో వార్డ్ మెంబర్ వాడపల్లి జకరయ్య జమ్మూ కాశ్మీర్ నుండి ప్రత్యేకంగా చెక్కతో తయారు చేసిన అశోక స్తంభమును ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును వారి స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలసి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి సమక్షంలో చెక్కతో తయారు చేసిన అశోక స్తంభమును అందజేశారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే తనకోసం కాశ్మీర్ నుండి తీసుకొచ్చిన చెక్కతో తయారు చేసిన అశోక స్తంభమును చూసి ఆయన ముగ్గులై వార్డ్ నెంబర్ జకరయ్యను అభినందించారు . ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు బండా రామకృష్ణ , దుంపల అమర్ నాథ్ పాల్గొన్నారు .

# ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కూకట్పల్లిలోని బాలాజీ నగర్ లో వివిధ మండపాల వద్ద జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ హాజరై వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వినాయక మండప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో పట్టుదలతో ముందుకు సాగాలి

* **ఎస్. ఐ. వి. ఇ, ప్రొఫెసర్ జోష్ణరాణి**






కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో పట్టుదలతో ముందుకు సాగాలి అని ఎస్. ఐ. వి. ఇ, ప్రొఫెసర్ జోష్ణరాణి అన్నారు. కుత్బుల్లాపూర్ కేఎం పాండు మెమోరియల్ గవర్నమెంట్ వోకేషనల్ జూనియర్ కళాశాల లో బుధవారం టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.ఐ. వి.ఇ , ప్రొఫెసర్ జోష్ణరాణి హజరై మాట్లాడుతూ విద్యార్థులను అన్నీ రంగాలలో రాణించాలన్నారు. కేఎం పాండు మెమోరియల్ గవర్నమెంట్ వోకేషనల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ షేక్ మైమున్ మాట్లాడుతూ రతన్ టాటా విద్యను కేవలం ఒక మనిషి జీవితం మార్చే విధంగా ఆయన చూశారు. ఒక విద్యార్థి చదువుకు సహాయం చేయడం అంటే కేవలం ఒక వ్యక్తిని , ఒక కుటుంబాన్ని, సమాజాన్ని పైకి తీసుకురావడం . ఈరోజు కేవలం టీచర్స్ డే వేడుక. గురువులను స్మరించుకుంటూ, వారి పట్ల మనం గౌరవాన్ని చాటే మహోన్నతమైన రోజన్నారు. పద్మవిభూషణ్ రతన్ నావెల్ టాటా జయంతి సందర్భంగా అధ్యాపకుల సేవలను గుర్తించి, వారిని అభినందిస్తూ సత్కరించి మోమెంటోస్ ను అందజేశారు. అనంతరం గాంధీనగర్ ఠాగూర్స్ హై స్కూల్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అహుతులను అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫౌండర్ బండారి సాయికుమార్ , వెలుగు ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఫౌండర్ ఇక్కుర్తి నారాయణ రావు, ఠాగూర్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ బండారి నెహా, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ నాగేంద్ర, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్




ప్రజాస్ఫూర్తి, భైంసా : బాలికను మాయమాటలతో తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై కుబీర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం...... ఈ నెల 15న సాయంత్రం బాలిక ఇతర పిల్లలతో కలిసి గణేష్ మండపం సమీపంలో ఆడుకుంటుండగా, నిందితుడు వారిని మాయమాటలతో తన ఇంటికి తీసుకెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం ఇతర పిల్లలను బయటకు పంపించి, బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. బాలిక ఏడుస్తుండటంతో అక్కడ ఉన్న ఇతర పిల్లలు భయపడి ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు తెలియజేశారు. తరువాత నిందితుని పైన పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు దర్యాప్తు చేపట్టి, బాధిత బాలికను వైద్య పరీక్షలకు పంపించి, ఆమె వాంగ్మూలాన్ని చట్టప్రకారం నమోదు చేశారు. బాలిక సంరక్షణ , రక్షణ కోసం సఖీ కేంద్రానికి తరలించారు. విశ్వసనీయ సమాచారం మేరకు భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద నిందితుడు జాధవ్ బిక్కు ను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుండి నేర సమయంలో ధరించినట్లు పేర్కొన్న దుస్తులను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. అరెస్ట్ చేసిన నిందితుడిని, న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.

# ఘనపూర్ మండల ఎంఆర్పీఎస్ –టీఎస్ కమిటీ ఎన్నిక



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘనపూర్ మండల కేంద్రంలో బుధవారం ఎంఆర్పీఎస్ -టీఎస్ మండల కమిటీని ప్రకటించారు. భూపాలపల్లి జిల్లా కన్వీనర్ రేణుకుంట్ల మహేష్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ - టీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ఈదునూరి యాకయ్య మాదిగ ఆదేశాల మేరకు మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఘనపూర్ మండల అధ్యక్షుడిగా ల్యాదల్ల రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా మరుపట్ల ప్రభాస్, కార్యదర్శిగా బొచ్చు రాజుకుమార్, కోశాధికారిగా కొయ్యల కార్తిక్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా మరుపట్ల సిద్ధు, సన్నీ, రోహిత్, మధుకర్, రాజు, సురేష్, మహేష్, బాబు, రవిలను ఎంపిక చేశారు. అనంతరం నూతన మండల అధ్యక్షుడు ల్యాదల్ల రాజశేఖర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న జిల్లా కన్వీనర్ రేణుకుంట్ల మహేష్ మాదిగకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై ఉద్యమంలో యువత, విద్యార్థులను ఏకం చేసి మాదిగ దండోరా ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించే దిశగా కృషి చేస్తానని అన్నారు.

# పొనుగోడులో ఎస్‌బీఐ నూతన శాఖ ఏర్పాటు చేయాలి

* **ఎస్‌బీఐ అధికారులకు ఉపసర్పంచ్ జోగు అరవింద్ రెడ్డి వినతి**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: మండలంలోని పొనుగోడు గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నూతన శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామ ఉపసర్పంచ్ జోగు అరవింద్ రెడ్డి బుధవారం ఎస్‌బీఐ హైదరాబాద్ హెడ్ ఆఫీస్‌కు వినతిపత్రం సమర్పించారు. పొనుగోడు గ్రామంలో 8,669 మంది జనాభాతో పాటు సమీప గ్రామాలను కలుపుకుంటే 10 వేలకు పైగా ప్రజలు ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం బ్యాంకింగ్ సేవల కోసం గ్రామస్థులు సుమారు 7 కిలోమీటర్లు గడ్డిపల్లి కి వెళ్లాల్సి వస్తోందన్నారు. రైతులు పంట రుణాల రెన్యూవల్, వృద్ధులు పింఛన్ల ఉపసంహరణకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం పొనుగోడులో ఎస్‌బీఐ శాఖను త్వరగా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

# గ్రామ గ్రామాన నల్ల నర్సింహులు శతజయంతి వేడుకలు

: **కడకం నర్సింహులు**

* **అక్టోబర్ 2న జిల్లా కేంద్రంలో పార్టీల కతీతంగా నిర్వహణ**



జనగామ, ప్రజాస్ఫూర్తి : నల్ల నర్సింహులు 100వ జయంతి వేడుకలను గ్రామ గ్రామాన వైభవంగా నిర్వహించాలని మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కడకం నర్సింహులు పిలు పునిచ్చారు. బుధవారం పట్టణం లోని మార్కండేయ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 2న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నల్ల నర్సింహులు శతజయంతి వేడుకలను పార్టీలకతీతంగా విజయవంతం చేయా లని కోరారు. ప్రతి గ్రామంలో నల్ల నర్సిం హులు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: హైదరాబాద్ కు చెందిన నిరుపేద ఆర్యవైశ్య కుటుంబం లో తల్లిదండ్రులు చల్లా పాండరయ్య సువర్ణ లు మూగవారు, ఇద్దరు కుమార్తెలు విద్యాభ్యాసం చేస్తున్నారు. వారికి బుధవారం సూర్యాపేట ఆర్యవైశ్య ప్రముఖులు యామా ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మిత్రులు కలిసి విరాళం సేకరించి 12,500 ఆర్థిక సహాయం చేయడం ద్వారా మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు యామా ప్రభాకర్ మాట్లాడుతూ సూర్యాపేటలో ఆర్యవైశ్యులు సేవాగుణం కలిగిన వారని, పేదవారికి ఆర్థిక సహాయం చేయడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా వుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు యామా ప్రభాకర్, కలకోట లక్ష్మయ్య , పోతుగంటి వెంకటేశ్వర్లు, తప్పి గాంధి, నీలా శ్రీనివాస్, బెలిదె వెంకన్న , చల్లా సత్యనారాయణ కిరాణం, వనమా నరసింహ రావు , తల్లాడ శ్రీనివాస్, బిక్కుమల్ల సంతోష్, బ్రహ్మాండ పల్లి సంతోష్ , బూర్లె నవీన్ శిల్ప హైదరాబాదు, బ్రహ్మదేవర సోమయ్య , వుప్పల శ్రవణ్, చల్లా లక్ష్మి ప్రసాద్ , చక్క లక్ష్మయ్య , చల్లా పాండయ్య, వాసా రాజశేఖర్ లు మరియు ఆర్యవైశ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# షహనాజ్ బేగంకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్




హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ లోని సనత్ నగర్, డీఎన్ఎం కాలనీకి చెందిన షహనాజ్ బేగంకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పీ హెచ్ డీ పట్టాను అందుకున్నారు. ఓయూ క్యాంపస్ లోని ఠాగూర్ ఆడిటోరియంలో, రాష్ట్ర గవర్నర్ , ఓయూ ఛాన్సలర్ శివ్ ప్రతాప్ శుక్లా అధ్యక్షతన జరిగిన 85వ స్నాతకోత్సవ సభలో, ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం చేతుల మీదుగా ఆమె డాక్టరెట్ పట్టాను అందుకున్నారు. ఫతే నగర్ నివాసి మహ్మద్ హుస్సేన్, ఖాజాబీల కూతురైనా షహనాజ్ బేగం, వారి ప్రోత్సాహంతో బాల్యం నుండే విద్యలో తన ప్రతిభను చూపుతూ వచ్చారు. గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఖాజా విజారత్ అలీతో ఆమె వివాహం జరిగింది. ఆ తర్వాత కూడా మరింత పట్టుదలతో, తన భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యలో షహనాజ్ బేగం తన సత్తాను చాటి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డేటా సెక్యూరిటీ యూసింగ్ హొమోమార్ఫిక్ ఎన్క్రిప్షన్ లో డాక్టరెట్ సాధించారు. షహనాజ్ బేగం డాక్టరెట్ పట్టాను పొందడం పట్ల ఆమె కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.

# పాపిరెడ్డి నగర్ లో కమిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే గాంధీకి వినతి



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్ పల్లి జోన్ ఆల్విన్ కాలనీ సర్కిల్ వెంకటేశ్వర నగర్ డివిజన్ లోని పాపిరెడ్డి నగర్ లోగల శ్రీశ్రీశ్రీ వీరంజనేయ శివాలయం ఆవరణలో కమిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలంటూ బుధవారం బస్తి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అరేకెపుడి గాంధీని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ పేర్ని ధర్మారావు, కె.వి.రాజు అధ్యక్షుడు ఆడెపు ప్రభాకర్ నేతలు ఆనంతరాములు, జీవి కన్నారావు. తిరుపతి రెడ్డి, పి శంకర్ రెడ్డి, డి రామ్ రెడ్డి , వనం ఆంజనేయులు, ఏ చంద్రశేఖర్ రెడ్డి, చంద్రయ్య, ముత్యం వెంకట్ రెడ్డి , పి.శంకర్ రెడ్డి, కనకా రెడ్డి, పండు గౌడ్, శ్రీనివాస్ , సత్యనారాయణ రెడ్డి, శ్రీకాంత్, భాస్కర్ గుప్తా ,శ్రీలత, లక్ష్మీ సులోచన.తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి.. ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం

* **బిఆర్ఎస్ హుజూర్ నగర్ నియోజకవర్గ నాయకుడు పిల్లుట్ల రఘు**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: వినాయక చవితిని పురస్కరించుకుని హుజూర్‌నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకుడు పిల్లుట్ల రఘు గరిడేపల్లి మండలంలోని కాచవారిగూడెం కాల్వపల్లి రాయినిగూడెం కీతవారిగూడెం అప్పన్నపేట అబ్బిరెడ్డిగూడెం లక్ష్మీపురం సర్వారం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు యువత ఉత్సవ కమిటీ సభ్యులు రఘుకు స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో వినాయక విగ్రహాలను అందజేసిన, మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కృష్ణా నాయక్, వీరం రెడ్డి శంబిరెడ్డి, మన్నెం వేణు యాదవ్, సర్వారం మాజీ సర్పంచ్ కర్నాటి నాగిరెడ్డి, మాజీ ఎంపిటిసి మేళ్లచెరువు వెంకటరమణ, ఉప సర్పంచులు ఎర్రగొల్ల మదార్, నాగరాజు, అంజి, వీరస్వామి, ఆకుల గోపీచంద్, ఇంజమూరి గురవమ్మ, అశోక్, చిరంజీవి, గంగరాజు, అచ్చయ్య, రాంబాబు, స్థానిక నాయకులు, ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగితే శరీరంలో ఏం జరుగుతుంది ?

మద్యం తాగడాన్ని ఒక సరదాగా ప్రారంభించి, దానిని ఒక అలవాటుగా మార్చుకుంటూ ఉంటారు. అయితే మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరం అని డాక్టర్లు పదే పదే చెబుతున్నారు. మద్యం సేవించడం వల్ల అనేక తీవ్రమైన నష్టాలు మన ఆరోగ్య విషయంలో వస్తాయని హెచ్చరిస్తున్నారు. మరి అవేమిటో ప్రస్తుతం మనం తెలుసుకుందాం.



మద్యపానం కారణంగా ఎముకల బలహీనత .. సెక్స్ సామర్థ్యం తగ్గుదల అధికంగా మద్యాన్ని తీసుకోవడం వల్ల ఎముకల బలహీనత వస్తుంది. క్యాల్షియం మరియు విటమిన్ డి శరీరంలో సరిగా పనిచేయకుండా పోతాయి. కీళ్లలో నొప్పి, కాళ్లలో నొప్పి వంటి సమస్యలు పెరుగుతాయి.అధికంగా మద్యం తీసుకోవడం వల్ల సెక్స్ సామర్థ్యం తగ్గుతుంది. వీర్యకణాల నాణ్యత పడిపోతుంది. ఫలితంగా సంతానలేమి సమస్య కలుగుతుంది. మద్యపానంతో తీవ్ర నష్టాలు.. జాగ్రత్త కాబట్టి ఇన్ని అనర్థాలకు కారణం అయ్యే మద్యాన్ని అధికంగా సేవించడం మానుకోవాలి. పూర్తిగా మానేసిన ఎలాంటి ఇబ్బంది ఉండదు. తరచూ మద్యం సేవించే వాళ్ళు ఈ విషయాలు తెలుసుకుని, ఈ ప్రమాదాలను అర్థం చేసుకొని తదనుగుణంగా మద్యం సేవించడాన్ని కంట్రోల్ చేసుకోవాలి.



మద్యం సేవించటం వ్యసనం అయితే ప్రాణాలకే ప్రమాదం . చాలామంది సంతోషకర సమయమైనా, విచారకర సమయమైనా మద్యం సేవించడానికి ఇష్టపడతారు. మొదట సరదా.. తర్వాత అలవాటుగా.. ఆపై వ్యసనంగా మారుతుంది. అలా మద్యం సేవించడం వ్యసనంగా మారితే అది ప్రాణాల మీదకు తెస్తుంది. అతిగా మద్యం సేవించే అలవాటు ఉంటే త్వరితగతిన దానిని మానుకోవలసిన అవసరం ఉంది. ఎదం టే ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ఎంతో నష్టపోక తప్పదు.

మద్యం సేవించటం వ్యసనం అయితే ప్రాణాలకే ప్రమాదం . చాలామంది సంతోషకర సమయమైనా, విచారకర సమయమైనా మద్యం సేవించడానికి ఇష్టపడతారు. మొదట సరదా.. తర్వాత అలవాటుగా.. ఆపై వ్యసనంగా మారుతుంది. అలా మద్యం సేవించడం వ్యసనంగా మారితే అది ప్రాణాల మీదకు తెస్తుంది. అతిగా మద్యం సేవించే అలవాటు ఉంటే త్వరితగతిన దానిని మానుకోవలసిన అవసరం ఉంది. ఎదం టే ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ఎంతో నష్టపోక తప్పదు.

### మద్యపానం కారణంగా లివర్, ప్యాంక్రియాస్ కు ప్రమాదం

తరచూ మద్యం ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయం తీవ్రంగా దెబ్బతింటుంది. ఎక్కువ ఆల్కహాల్ తాగడం వల్ల లివర్ ఫెయిల్యూర్ అవుతుంది. కాలేయం వాపు సమస్య కూడా వచ్చే అవకాశం ఉంటుంది. ప్యాంక్రియాస్ అనేది ఇన్సులిన్ మరియు ఇతర రసాయనాలు ఉత్పత్తి అయ్యే శరీరంలోని అవయవం. మద్యపానం వల్ల ఇది ఎఫెక్ట్ అవుతుంది. ఇది ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కు కూడా దారితీస్తుంది. క్యాన్సర్, డయాబెటిస్, గుండె జబ్బుల ప్రమాదం మద్యం ఎక్కువ సేవించడం వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. మద్యాన్ని తీసుకోవడం వల్ల ప్యాంక్రియాస్ లో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గుతుంది. అటువంటి పరిస్థితిలో రక్తంలో చక్కెరస్థాయిలు పెరుగుతాయి. ఫలితంగా మధుమేహం సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. నేషనల్ హార్ట్ అసోసియేషన్ చెప్పిన వివరాల ప్రకారం ఆల్కహాల్ గుండె ఆరోగ్యానికి హాని చేస్తుంది. ఆల్కహాల్ ఎక్కువ సేవించే వారిలో రక్తంలో కొవ్వు స్థాయిలు పెరిగి, హార్ట్ స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది.

### హ్యాంగోవర్ ఎందుకు ఏర్పడుతుంది?

ఈ విషయంపై ఇప్పటి వరకు జరిగిన పరిశోధనలను పరిశీలించినప్పుడు హ్యాంగోవర్ లక్షణాలకు వివిధ కారణాలు కనిపించాయి. వీటిలో మొదటిది నిర్జలీకరణం అంటే డీ హైడ్రేషన్.శరీరంలో సహజంగా ఏర్పడే రసాయన పదార్థాల సాంద్రత (కాన్సంట్రేషన్)ను ఆల్కాహాల్ తగ్గిస్తుంది. ఎక్కువ మొత్తంలో మద్యం తీసుకోవడం వల్ల ఇది ఏర్పడుతుంది. ఇలా తీసుకోవడం వల్ల రక్తంలో ఇథనాల్, దాని డీకంపోజిషన్ ఉత్పత్తుల సాంద్రత పెరుగుతుంది.అయితే, ఈ హ్యాంగోవర్ ఈ మార్పుల కారణంగానే ఏర్పడిందా అన్న మాత్రం స్పష్టం కాలేదు. దీని మీద ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ అసౌకర్యాన్ని కొందరు పరిశోధకులు వ్యాధి నిరోధకతతో ముడి పెట్టారు. మద్యం తీసుకున్నప్పుడు నొప్పి, మంటకు సంబంధించిన కొన్ని పదార్థాలు విడుదలవుతాయని, దీనివల్ల హ్యాంగోవర్ వంటి అసౌకర్యం ఏర్పడుతుందని భావించారు.

# కార్బన్ డై ఆక్సైడ్‌ను నిర్మూలించవచ్చా?




పర్యవరణ మార్పుల నుంచి భూమిని రక్షిండం కోసం మొక్కను పెంచడం అనేది అందరికి తెలిసిన సాదాహారణ విషయం . అయితే ప్రపంచ అడవులను కాపాడటానికి వాటికి మరింత భద్రత కల్పించాలని, నరికిన వృక్షాలని తిరిగి నాటాలని సందేశం ఇస్తూ పర్యావరణ పరిరక్షక ప్రచారకురాలు గ్రెటా థన్‌బర్గ్ ఒక చిత్రాన్ని కూడా నిర్మించారు.ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షక ప్రచారకర్తలు పర్యావరణం కోసం రకరకాల ప్రచారాలను నిర్వహిస్తున్నారు.గత దశాబ్దంలో బ్రిటన్ ప్రభుత్వం కొన్ని కోట్ల మొక్కలు నాటింది. 2016లో భారతదేశంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఒక్క రోజులోనే 5 కోట్ల మొక్కలు నాటారు. ఇథియోపియా ఒకే రోజులో 35 కోట్ల మొక్కలు నాటినట్లు ప్రకటించుకుంది.ప్రస్తుతం ఉన్న అడవులని కాపాడుకుంటూ కొత్త వాటిని నాటడం మంచిదే. అయితే, పర్యావరణ పరిరక్షణ కోసం పూర్తిగా మొక్కల మీదే ఆధారపడకూడదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

వృక్షాలు పర్యావరణ సంరక్షణకు సహకరిస్తాయి. కానీ, వాటంతట అవే వాతావరణ పునర్నిర్మాణానికి సహకరించవంటూ చాలా మంది ఈ వాదన పట్ల విమర్శలు చేశారు.గతంలో ఎన్నడూ లేనంతగా వాతావరణంలోకి గ్రీన్‌హౌస్ వాయువులు ముఖ్యంగా కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అవుతుండటం వలన వాతావరణంలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పెరిగిపోతున్నాయి.దీంతో ఐస్ షీట్లు కరగడం, సముద్ర మట్టాలు పెరగడం, హారికేన్లు సంభవించడం, కరువు పెరగడం జరుగుతోంది. గ్రీన్‌హౌస్ వాయువులని వాతావరణంలోకి విడుదల చేయడం పూర్తిగా ఆపగలగడమే ఒక పరిష్కారం.

ఉదాహరణకి ఫాసిల్ (బొగ్గు, గ్యాస్ తరహా) ఇంధనాల వాడకానికి బదులు సోలార్ శక్తి ద్వారా నడిచే పరికరాలు వాడటం ఒక మార్గం.అడవులని నిర్మూలించడం ద్వారా వాతావరణంలోకి అత్యధిక శాతంలో కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అవుతుంది.2017లో ప్రపంచ వ్యాప్తంగా 41 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అయితే అందులో 4 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ అడవుల నిర్మూలన కారణంగా చోటు చేసుకుంది. చెట్లు నరకడం ఆపితే ఏటా విడుదల అయ్యే వ్యర్థాలలో 10 శాతం తగ్గించవచ్చుఅయితే ఇప్పటికే చాలా వినాశనం జరిగింది. గాలిలోంచి కార్బన్ డై ఆక్సైడ్‌ని నిర్మూలించడానికి సరైన మార్గాలు కనిపెట్టాల్సి ఉంది.ఇందుకోసం శాస్త్రవేత్తలు చాలా రకాలైన సాంకేతిక మార్గాలని ప్రతిపాదించారు. కానీ, వృక్షాలు కార్బన్ డై ఆక్సైడ్ గ్రహించడంలో ముఖ్యమైన పాత్రని పోషిస్తాయి. అయితే కొత్త మొక్కలు నాటడం కానీ, లేదా కొత్తగా అడవులని అభివృద్ధి చేయడం కానీ చేయాలి. చెట్టు సజీవంగా ఉన్నంతవరకు గాలిలో కార్బన్ డై ఆక్సైడ్‌ని అవి పట్టి ఉంచుతాయి.

ఇందుకోసం ముఖ్యంగా అమెజాన్ లాంటి అడవులని నాశనం చేయడం ఆపాలి.ప్రపంచంలో ఇంకా 0.9 బిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో అడవులని పెంచేందుకు అవకాశం ఉందని 2019లో స్విట్జర్లాండ్‌కి చెందిన థామస్ క్రౌథెర్ నిర్వహించిన ఒక అధ్యయనం పేర్కొంది.ఈ అడవులు అభివృద్ధి చెందితే 752 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌ని గాలిలోంచి తీసుకోగలవని ఈ అధ్యయనం తెలిపింది.అయితే, ఈ అధ్యయనం ఇతర పర్యావరణ శాస్త్రజ్ఞుల నుంచి విమర్శలు ఎదుర్కొంది. చెట్లు నిల్వ ఉంచగలిగే కార్బన్ డై ఆక్సైడ్ శాతంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.క్రౌథెర్ విడుదల చేసిన అధ్యయనంలో చెట్లు నాటడానికి అందుబాటులో ఉన్నట్లు చెప్పిన స్థలంలో ఇప్పటికే చెట్లు ఉన్నాయని విమర్శించారు. వీటిని అక్టోబర్ 2019లో ఒక సైన్స్ పత్రిక ప్రచురించింది.







### వాతావరణ సమస్యలు ఎదుర్కోవడానికి చెట్లు ఎంతవరకు ఉపయోగపడతాయి?

సహజ రీతుల్లో వాతావరణాన్ని పరిరక్షించాలంటే వెట్‌ల్యాండ్స్ (చిత్తడి నేలలు)ని సంరక్షించడం, ఇతర పరిరక్షక పద్ధతులని అవలంబించడం, పంట పొలాల నుంచి విడుదలయ్యే వ్యర్థాలని తగ్గించడం లాంటివి చెయ్యాలని 2017లో నిర్వహించిన ఒక అధ్యయనం పేర్కొంది. సహజ విధానాలను పాటించడం ద్వారా ప్రతి ఏటా 23.8 బిలియన్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌ని బంధించి ఉంచుతాయని తెలిపింది. వాతావరణం విషయంలో అనిశ్చితి అయితే ఉంటుంది. వాతావరణం అనుకోని రీతిలో మార్పులకి లోనవుతూ ఉంటుంది.దీంతో చెట్లు పెరిగే తీరులో మార్పులు చోటు చేసుకుంటాయి.



# రసం పొడి.. సింపుల్‌గా ఇలా తయారుచేసుకోండి..

ఎన్ని వెరైటీలతో భోజనం లాగించినా .. చివర్లో రసంతో ఓ నాలుగు ముద్దలు పడితేనే చాలా మందికి భోజనం పరిపూర్ణమవుతుంది. కేవలం రసం కోసం భోజనం చేసే వారూ ఉంటారు. ముఖ్యంగా దక్షణభారతదేశంలో రసం కు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు.. అయితే రుచికరంగా రసం తయారు చేయడం అంత ఈజీ కాదు. బాగా తలలు పండిన మన అమ్మొమ్మలు, బామ్మలు మాత్రమే టెస్టీగా రసం తయారు చేస్తారు. ఇక రసం రుచిగా ఉండాలంటే రసం పొడి తయారుచేసుకోవడం ఎంతో ముఖ్యం. అసలు రసం పొడి ఎలా తయారుచేసుకోవాలా ఇప్పుడు చూద్దాం.

| కావాల్సిన పదార్థాలు |
| --- |
| ఎండుమిర్చి - 15 |
| మిరియాలు - పావు కప్పు |
| కందిపప్పు - పావు కప్పు |
| జీలకర్ర- పావు కప్పు |
| ధనియాలు - ఒక కప్పుల |
| కరివేపాకులు - ఐదు రెబ్బలు |



### రసం పొడి ఇలా తయారు చేసుకోండి..

ముందుగా స్టవ్ మీద కళాయి పెట్టి ధనియాలు వేసి వేయించాలి. వీటిని చిన్న మంట మీద వేయిస్తే బాగా వేగుతాయి. తర్వాత జీలకర్ర, కందిపప్పు, మిరియాలు, ఎండుమిర్చి కూడా వేసి వేయించాలి. చివరిలో నాలుగు కరివేపాకు రెమ్మలు వేసుకోవాలి. ఇవన్నీ చల్లారాక మిక్సీ జార్లో వేయాలి. ఒక టేబుల్ స్పూన్ పసుపు, అర స్పూన్ ఇంగువ కూడా వేసి అన్ని మెత్తగా పొడిలా చేసుకోవాలి.. దీన్ని గాలి చొరబడని ఒక డబ్బాలో వేసి ఫ్రిజ్లో పెట్టుకోవాలి.. ఆరు నెలల వరకు ఇది తాజాగా ఉంటుంది. దీంతో చారు చేసుకుంటే చాలా తాజాగా, చాలా టేస్టీగా ఉంటుంది.



### పొడిలో ఆరోగ్యప్రయోజనాలు

ఈ చారు పొడిలో ముఖ్యమైన పదార్థాలు ధనియాలు, జీలకర్ర, కందిపప్పు. ఈ మూడింటి వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ధనియాలలో ఉండే ఔషధ గుణాల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అనేక చర్మ సమస్యలను తగ్గించడంలో ధనియాలు ముందుంటాయి. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. దీనిలో యాంటీ హైపర్ గ్లైసిమిక్ లక్షణాలు ఎక్కువ. కాబట్టి మధుమేహ రోగులు కచ్చితంగా ధనియాలను ఆహారంలో భాగం చేసుకోవాలి. చారు పొడిలో ఈ ధనియాలు ఎక్కువ శాతం ఉంటాయి కాబట్టి దీంతో ప్రతిరోజు రసం చేసుకుంటే మంచిది. జీలకర్రను కూడా ఇందులో వినియోగించాం, దానివల్ల గుండె సమస్యలు రాకుండా ఉంటాయి. బీపీ, షుగర్ అదుపులో ఉంచుతుంది. కొన్ని రకాల చర్మ సమస్యలు, అలెర్జీలను రాకుండా అడ్డుకుంటుంది. కందిపప్పు తినడం వల్ల ప్రోటీన్లు పుష్కలంగా అందుతాయి. ఈ పప్పుతో ఫైబర్, క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. జ్ఞాపకశక్తిని పెంచేందుకు కూడా ఇది ఔషధంలా పనిచేస్తుంది.



# MOVIE TIME



## విశ్వంభరపై చిరంజీవిదే తుది నిర్ణయం!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. ఈ మూవీ రిలీజ్‌పై కొంతకాలంగా పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తాజాగా 'విశ్వంభర'ను సంక్రాంతి 2027కి తీసుకురావాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే చిరంజీవి నటిస్తున్న 'కాకా' చిత్రాన్ని మరో తేదీకి మార్చే అవకాశం ఉందనే టాక్ సైతం వినిపించింది. అయితే 'విశ్వంభర' రిలీజ్ డేట్‌పై తుది నిర్ణయం వారం రోజుల్లో చిరంజీవి తీసుకోనున్నారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఆయన నిర్ణయమే ఫైనల్ కానుందని, ప్రస్తుతం నిర్మాతలు మెగాస్టార్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారని తెలుస్తోంది. రిలీజ్ డేట్ ఖరారు కాకపోవడంతో 'విశ్వంభర' ప్రమోషన్స్‌ను పూర్తి స్థాయిలో మొదలుపెట్టలేకపోతున్నారు మేకర్స్. విడుదల తేదీపై క్లారిటీ వచ్చిన తర్వాత సినిమాపై మళ్లీ ఆసక్తిని పెంచేలా భారీ ప్రమోషన్స్ చేయాల్సిన అవసరం ఉందని చిత్ర వర్గాలు భావిస్తున్నాయి.

## ఆదర్శ కుటుంబంలో నివేతా, డింపుల్ స్పెషల్ రోల్స్!

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శ కుటుంబం'. కుటుంబ ప్రేక్షకులను ప్రధానంగా టార్గెట్ చేస్తూ త్రివిక్రమ్ తనదైన శైలిలో కథను రూపొందిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం అన్నపూర్ణ స్టూడియోస్‌లో చిత్రీకరణ జరుగుతున్న పాటలో నివేతా పేతురాజ్, డింపుల్ హయాతి సైతం భాగమవుతున్నారు. సినిమాలో వీరిద్దరూ ప్రత్యేక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఇక ఈ సినిమా షూటింగ్ ఇప్పటివరకు 110 రోజులకుపైగా పూర్తయింది. చిత్రీకరణ ఇంకా కొనసాగుతున్నప్పటికీ.. అక్టోబర్ 2న సినిమాను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.





## సూర్య-జ్యోతిక ది సీక్వెల్



తమిళ స్టార్ కపుల్ సూర్య, జ్యోతిక మరోసారి పెళ్లి చేసు కున్న విషయం తెలిసిందే. వివాహ బంధంలోకి అడుగుపెట్టి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విదేశాల్లో వెస్ట్రన్ స్టైల్‌లో వౌ రిన్యూవల్ చేసుకున్నారు. తాజాగా ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను జ్యోతిక సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'ది సీక్వెల్' పేరుతో జరిగిన ఈ వేడుకలో సూర్య బర్గండీ బ్లేజర్‌లో, జ్యోతిక లావెండర్ గౌన్‌లో సందడి చేశారు. కొడుకు దేవ్ జ్యోతికతో, కూతురు దియా సూర్యతో కలిసి ఈ వేడుకలో పాల్గొన్నారు. తల్లిదండ్రులు వౌస్ ఎక్స్‌చేంజ్ చేసుకుంటున్న సమయంలో ఇరువైపులా పిల్లలు నిల్చోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రత్యేక రోజును అందంగా తీర్చిదిద్దిన వెడ్డింగ్ ప్లానర్స్, స్నేహితులు, కుటుంబ సభ్యులకు జ్యోతిక ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



## దిశా పటానీపై ట్రోలింగ్!

ముంబయిలో అంబానీ కుటుంబం నిర్వహించిన వినాయక చవితి వేడుకలకు బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ హాజరైంది. ఈ వేడుకలో దిశా ఎరుపు రంగు లెహంగాతో, డీప్ నెక్‌లైన్ బ్లౌజ్‌తో కనిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దాంతో ఆమె డ్రెస్‌పై నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. వినాయక చవితి వేడుకలకు ఇలాంటి దుస్తులు వేసుకు వస్తారా? అంటూ పలువురు ప్రశ్నించారు. మరికొందరు పండుగలకు ప్రత్యేక డ్రెస్ కోడ్ ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## మాళవికకు మరో ఫ్లాప్!

సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉన్న హీరోయిన్ మాళవిక మోహనన్‌కు ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలు దక్కడం లేదు. వరుసగా రెండు హైప్రొఫైల్ చిత్రాలు నిరాశపరిచాయి. ప్రభాస్ సరసన 'ది రాజా సాబ్'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. జనవరిలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. తాజాగా తమిళంలో తెరకెక్కిన స్పై థ్రిల్లర్ 'సర్దార్ 2'తో ప్రేక్షకుల ముందుకొచ్చింది మాళవిక. ఇందులో మాళవిక స్పై పాత్రలో కనిపించింది. సినిమాకు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. తమిళంతో పాటు తెలుగు మార్కెట్‌లోనూ ఈ చిత్రం నిరాశపరిచింది. దీంతో ఈ ఏడాది నటించిన రెండు భారీ చిత్రాలు వరుసగా బాక్సాఫీస్ వద్ద నిరాశపరచినట్టయింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.